సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
ఆదివారం, 09.08.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 278
పేజీలు: 08 వెల: రూ. 5

## పండుగ వేళ
# మద్యం బంద్
### హైదరాబాద్, సైబరాబాద్, ఫ్యూచర్ సిటీ పరిధిలో
### వైన్ షాపులు బంద్

- చార్మినార్ జోన్‌లో 48 గంటల పాటు మద్యం దుకాణాలు మూసివేత
- శాంతిభద్రతల పరిరక్షణ కోసమే ఈ నిర్ణయమన్న పోలీసులు
- స్టార్ హోటళ్లు, రిజిస్టర్డ్ క్లబ్బుల్లోని బార్లకు మినహాయింపు




**ముద్ర, హైదరాబాద్ :**
బోనాల పండుగ సందర్భంగా మందుబాబులకు పోలీసులు బ్యాడ్ న్యూస్ చెప్పారు. పండుగ వేడుకలు ప్రశాంతంగా జరగాలనే ఉద్దేశంతో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా నగరంలో మద్యం అమ్మకాలపై ఆంక్షలు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆగస్టు 9న జరగనున్న బోనాల ఉత్సవాల నేపథ్యంలో హైదరాబాద్, సైబరాబాద్, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో నిర్దేశిత సమయాల్లో వైన్స్, కల్లు దుకాణాలు, బార్లను మూసివేయనున్నారు.
హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం నగరంలో జోన్ల వారీగా ఆంక్షలు అమల్లో ఉంటాయి. ముఖ్యంగా చార్మినార్ జోన్‌లో ఆగస్టు 9 ఉదయం 10 గంటల నుంచి ఆగస్టు 11 ఉదయం 10 గంటల వరకు (48 గంటలు) మద్యం దుకాణాలు, రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్‌లు పూర్తిగా మూసివేయనున్నారు. రాజేంద్రనగర్, గోల్కొండజోన్లలో మిగతా 02లో




### జర్నలిజానికి, వర్కింగ్ జర్నలిస్టులకు
# రక్షణ అవసరం
### వర్కింగ్ జర్నలిస్టుల హక్కులు కాపాడాలి

- జర్నలిస్టులపై కేసులు ఆందోళనకరం
- మీడియా స్వేచ్ఛకు ముప్పు పెరుగుతోంది
- జర్నలిస్టులు ఐక్యంగా పోరాడాలి
- వర్కింగ్ జర్నలిస్ట్ యాక్ట్ ను పునరుద్ధరించాలి
- ఐజేయూ సదస్సులో వక్తలు

03

## అమ్మాయిలు తగ్గుతున్నారు!
### రాష్ట్రంలో బాలికల జననాల నిష్పత్తి ఆందోళనకరం

- ఖమ్మం జిల్లాలో 880 మంది బాలికలే
- భద్రాద్రి కొత్తగూడెంలో అత్యధికంగా 904
- రాష్ట్ర సగటు 910 కంటే తక్కువే

02



## సాగునీటి ప్రాజెక్టులకు
# రూ.5 వేల కోట్లు
### భూసేకరణ, పునరావాసానికి నిధుల కొరత రానివ్వం
### మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

- ఇప్పటికే రూ.2 వేల కోట్లు విడుదల.. త్వరలో మరో రూ.3 వేల కోట్లు
- అనుమతుల పేరుతో పనులు ఆగొద్దు..
- కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు
- మిడ్‌మానేరు ఎడమ కాలువ పనులు వెంటనే పునఃప్రారంభించాలి
- పత్తిపాక డీపీఆర్ ఆగస్టు నెలాఖరులోగా సిద్ధం
- 96 శాతం పూర్తయిన రోళ్లవాగుకు అటవీ అనుమతులు వేగవంతం

03



## చట్టవ్యతిరేక చర్యలు ఉపేక్షించం
### నిరసనలపై చంద్రబాబు ఫైర్



- గొడ్డలి పార్టీపై తీవ్ర వ్యాఖ్యలు
- ఈ నెలలోనే రెండు కీలక ప్రాజెక్టులు
- వేగంగా సాగుతున్న అమరావతి పనులు

02

## పెద్ద కుటుంబానికి రూ.2.25 కోట్ల సాయం

- ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి.. తల్లి కోసం రూ.25 లక్షలు.
- పిల్లల చదువు, భవిష్యత్తు బాధ్యతను పార్టీ తీసుకుంటుందని కేసీఆర్ హామీ

### పెద్ద దిక్కుగా కేసీఆర్



02

## భారత్‌కు ట్రంప్ బిగ్ షాక్..!

- అమెరికా సెనేట్ ఆమోదం!
- జాబితాలో భారత్, చైనాతోపాటు రష్యా ఇంధన కొనుగోలు దేశాలు
- రష్యాపై అమెరికా ఆంక్షల యుద్ధం మరో మలుపు
- భారత్ కు నో టెన్షన్స్.. తిప్పలు అమెరికాకే

### 100% టారిఫ్ ఫ్లాన్..




02

## తెలంగాణపై బీజేపీ
# బిగ్ ప్లాన్!
### ఢిల్లీ వేదికగా తెలంగాణ వ్యూహాలు
### ఎన్నికలే టార్గెట్‌గా బీజేపీ స్పీడ్

- బండి ఇంట్లో కీలక భేటీలు
- తెలంగాణపై ఢిల్లీ పెద్దల ఫోకస్
- విభేదాలకు చెక్.. ఐక్యతపై దృష్టి
- జీహెచ్ఎంసీ ఎన్నికలే తొలి టార్గెట్
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా బీజేపీ
- తెలంగాణలో బలం పెంచేలా బీజేపీ వ్యూహం
- అసెంబ్లీ ఎన్నికల కోసం ఇప్పటి నుంచే కసరత్తు



**ముద్ర డెస్క్ :**
బీజేపీ అధిష్ఠానం తెలంగాణ రాజకీయాల్లో మరో మలుపు తీసుకుంటూ వ్యూహాత్మకంగా కదులుతోంది. ఒకవైపు వచ్చే ఏడాది ఎన్నికలు జరిగే పంజాబ్, గుజరాత్‌లో గెలుపుపై దృష్టి సారించిన కమలం పార్టీ మరోవైపు దరక్షిణాన పట్టు బిగించే ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా కర్ణాటక తర్వాత గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్న తెలంగాణలో పార్టీలో జోష్ పెంచడంతోపాటు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదిగేలా వ్యూహాలు రూపొందిస్తోంది. త్వరలో జరగబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలు, రాబోయే అసెంబ్లీ పోరులో విజయం సాధించాలనే లక్ష్యంతో కేంద్ర స్థాయి నుంచి స్పష్టమైన దిశానిర్దేశం జరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఢిల్లీని వేదికగా రాష్ట్ర నాయకుల సమావేశాలు జరగడం, పార్టీలో సమన్వయాన్ని పెంచే ప్రయత్నాలు ఈ వ్యూహానికి ప్రధాన అంశాలుగా మారాయి.

**ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా..**
పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు రెండింటిలోనూ బలమైన పనితీరు చూపాలనే ఆలోచనతో బీజేపీ అధిష్టానం పని చేస్తోంది. హైదరాబాద్ లోని మున్సిపల్ ఎన్నికలు పార్టీకి కీలక పరీక్షగా మారనున్న నేపథ్యంలో, రాష్ట్ర స్థాయి నాయకత్వం, కార్యకర్తల సమన్వయం, సంస్థాగత బలం పెంచేలా చర్చలు సాగుతున్నాయి. కేవలం ఎన్నికల క్యాంపెయిన్ కు పరిమితం కాకుండా, దీర్ఘకాలిక రాజకీయ బలాన్ని నిర్మించే దృష్టితో వ్యూహాలు రూపొందుతున్నట్లు అర్థం అవుతోంది.

**బండి నివాసంలో సమావేశాలు..**
ఢిల్లీలోని కేంద్ర మంత్రి బండి సంజయ్ నివాసం రాష్ట్ర నాయకుల సమావేశాలకు ముఖ్య వేదికగా మారింది. ఇక్కడ జరుగుతున్న చర్చలు కేవలం సాధారణ సమావేశాలుగా కాకుండా, భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలకు దారితీస్తున్నాయి. రాష్ట్ర స్థాయి నాయకులు, కేంద్ర నాయకత్వం మధ్య నేరుగా సంప్రదింపులు జరగడం వల్ల సమస్యలను గుర్తించి, ప రిష్కార మార్గాలు చర్చించే అవకాశం ఏర్పడుతోంది. ఇది పార్టీలో కమ్యూనికేషన్ గ్యాప్‌ను తగ్గించే దిశగా ఉన్నట్లు కనిపిస్తోంది.

**విభేదాలు ముగింపు..**
పార్టీలోని వర్గ విభేదాలను అధిగమించి, ఐక్యంగా ముందుకు సాగాలనే సందేశం అధిష్టానం నుంచి మిగతా 02లో

## జీవితమే
# అసలు పరీక్ష
### ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు!

- ఎప్పటికప్పుడు నేర్చుకునేవారిదే విజయం
- టెక్నాలజీతో మారుతున్న ఉద్యోగాలు, పరిశ్రమలు
- యువత నిర్ణయాలే 'వికసిత్ భారత్'కు కీలకం
- వచ్చే 30–35 ఏళ్లు యువతకు అత్యంత కీలకం

పరిశోధన, కొత్త ఆలోచనలకు అపార అవకాశాలు



**ముద్ర, ఢిల్లీ:**
ఐఐటీ ఢిల్లీ 57వ స్నాతకోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్థులకు కీలక సూచనలు చేశారు. క్యాంపస్‌లో సిలబస్ ఉంటుందని.. కానీ జీవితంలో సిలబస్‌కు వెలుపలే అసలు పరీక్షలు ఎదురవుతాయని అన్నారు. జీవితానికి ముందుగా నిర్ణయించిన ప్రశ్నపత్రం, సమాధానాలు ఉండవని.. ఎదురయ్యే సమస్యలను తామే గుర్తించి పరిష్కరించుకోవాల్సి ఉంటుందని చెప్పారు.
ఐఐటీ నుంచి విద్యార్థులు కేవలం డిగ్రీ మాత్రమే కాకుండా స్నేహాలు, జ్ఞాపకాలు, అనుభవాలు, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వాన్ని కూడా వెంట తీసుకెళ్తున్నారని మోదీ అన్నారు. మిడ్–సెమిస్టర్ పరీక్షలు, ప్రాజెక్టులు, ప్రయోగశాలల్లో ఎదురైన సవాళ్లే విద్యార్థుల్లో సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని పెంచాయని ప్రశంసించారు.
సవాళ్లకు భయపడకుండా.. వాటిలో దాగి ఉన్న అవకాశాలను గుర్తించాలని సూచించారు. ఎప్పుడూ ప్రశ్నించే తత్వాన్ని కొనసాగించాలని, ప్రశ్నలు అడగడమే కాకుండా వాటికి పరిష్కారాలు కనుగొనే ధైర్యం కూడా ఉండాలని పిలుపునిచ్చారు. వేగంగా మారుతున్న ప్రపంచంలో ఏఐ, సెమీకండక్టర్లు, స్టార్టప్‌లు వంటి రంగాల్లో యువత మిగతా 02లో

### ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం, 09.08.2026
www.mudranews.in | @mudranews



## పొటాషియం ఉన్న ఆహారం తీసుకోండి




అరటిపండ్లు, కొబ్బరి నీరు, ఆకుకూరలు వంటి పొటాషియం ఉన్న ఆహారాన్ని ఆహారంలో చేర్చుకోవడం కండరాల పనితీరుకు సహాయపడుతుంది. అయితే తరచూ సమస్య ఉంటే వైద్యుల సలహాతో కారణాన్ని తెలుసుకోవాలి.

# తెలంగాణపై బీజేపీ బిగ్ ప్లాన్!




(మొదటి పేజీ తరువాయి)
స్పష్టంగా వస్తోంది. జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో జరిగిన చర్చల్లో ఈ అంశం ప్రాధాన్యం పొందినట్లు సమాచారం. ఎన్నికల్లో విజయం సాధించాలంటే అంతర్గత సమస్యలు అడ్డంకిగా మారకూడదనే అవగాహనతో, నాయకుల మధ్య సమన్వయం పెంచే చర్యలు చేపట్టబడుతున్నాయి. ఇది పార్టీ సంస్థాగత బలాన్ని పెంచి, కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం పెంచే అవకాశం కలిగిస్తుంది.

### రాజకీయ ప్రభావం..

ఢిల్లీలో జరుగుతున్న ఈ కదలికలు తెలంగాణలో బీజేపీ స్థానిక స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బలోపేతం చేసే ప్రయత్నంగా భావిస్తున్నారు. ఎన్నికలకు ముందు అంతర్గత ఐక్యతను నిర్ధారించుకోవడం, స్పష్టమైన బాధ్యతల పంపిణీ, కార్యాచరణ ప్రణాళికలు రూపొందించడం వంటివి ఇప్పుడు ప్రాధాన్యం పొందుతున్నాయి. ఈ వ్యూహం ఎంతవరకు ఫలితాలు ఇస్తుందనేది రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, ప్రతిపక్షాల పనితీరు, ప్రజా స్పందనపై ఆధారపడి ఉంటుంది. అయితే అధిష్టానం స్పష్టమైన దిశానిర్దేశం ఇవ్వడం, సమన్వయాన్ని ప్రోత్సహించడం పార్టీకి సానుకూల సంకేతంగా నిలుస్తోంది.
మొత్తంమీద ఢిల్లీ వేదికగా జరుగుతున్న ఈ చర్చలు, సమావేశాలు తెలంగాణలో బీజేపీ రాజకీయ వ్యూహాన్ని మరింత స్పష్టం చేస్తున్నాయి. ఎన్నికల లక్ష్యం, అంతర్గత ఐక్యత, సంస్థాగత సమన్వయం ఈ మూడు అంశాలపై దృష్టి సారించి అధిష్టానం ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తోంది.

# అమ్మాయిలు తగ్గుతున్నారు!



ముద్ర ప్రతినిధి, ఖమ్మం:
తెలంగాణ రాష్ట్రంలో బాలికల జననాల నిష్పత్తి క్రమంగా తగ్గుతున్నట్లు గణాంకాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి వెయ్యి మంది బాలురకు సగటున 910 మంది బాలికలు జన్మిస్తుండగా, ఖమ్మం జిల్లాలో ఈ సంఖ్య మరింత తగ్గి 880కు చేరింది. ఇది రాష్ట్ర సగటు కంటే గణనీయంగా తక్కువ కావడం ఆందోళన కలిగిస్తోంది.
ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని రెండు జిల్లాలను పరిశీలిస్తే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రతి వెయ్యి మంది బాలురకు 904 మంది బాలికలు జన్మిస్తున్నారు. అయినప్పటికీ ఈ సంఖ్య కూడా రాష్ట్ర సగటును అందుకోలేకపోయింది.
లింగ నిష్పత్తి తగ్గుదల వెనుక సామాజిక, ఆర్థిక, ఆరోగ్య సంబంధిత అనేక కారణాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. గర్భిణులకు సరైన వైద్య సేవలు, పోషకాహారం, మహిళల ఆరోగ్యంపై అవగాహన, బాలికల పట్ల సమాన దృక్పథం పెంపొందించడం వంటి అంశాలపై ప్రభుత్వం మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.
అక్రమంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేయించి, గర్భంలోని శిశువు ఆడపిల్ల అని తెలిసిన తర్వాత కొంతమంది గర్భాన్ని ఉద్దేశపూర్వకంగా తొలగించడం భారతదేశంలో చట్టవిరుద్ధం అయినప్పటికీ అక్రమంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, గర్భంలో ఆడశిశువు ఉందని తెలిసిన తర్వాత కొంతమంది గర్భస్రావాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటువంటి చట్టవిరుద్ధ చర్యలు బాలికల జననాల నిష్పత్తిపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే ఏ ప్రాంతంలోనైనా తగ్గిన లింగ నిష్పత్తికి ఇదొక్కటే కారణమని చెప్పలేమని, దీనిపై సమగ్ర పరిశీలన అవసరమని వారు సూచిస్తున్నారు.
ప్రభుత్వం 'బేటీ బచావో – బేటీ పడావో' వంటి పథకాల ద్వారా బాలికల సంరక్షణ, విద్య, సాధికారత కోసం చర్యలు తీసుకుంటున్నప్పటికీ, జిల్లాల వారీగా నమోదవుతున్న గణాంకాలు ఇంకా ఆందోళనకరంగానే ఉన్నాయి. మహిళా శిశువుల రక్షణ, లింగ వివక్ష నిర్మూలన, అక్రమ లింగ నిర్ధారణ పరీక్షలపై కఠిన చర్యలు కొనసాగించాలని సామాజిక సంస్థలు కోరుతున్నాయి.
ఖమ్మం జిల్లాలో నమోదైన 880 లింగ నిష్పత్తి రాష్ట్రంలోనే అత్యల్ప స్థాయిల్లో ఒకటిగా ఉండడం, స్థానిక యంత్రాంగానికి హెచ్చరికగా మారింది. దీనిపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని వైద్య, మహిళా సంక్షేమ వర్గాలు సూచిస్తున్నాయి.

# టర్కీ, పాక్‌లతో సౌదీ డిఫెన్స్ డీల్



ముద్ర డెస్క్ :
పశ్చిమాసియాలో మారుతున్న భద్రతా సమీకరణాల నేపథ్యంలో సౌదీ అరేబియా, పాకిస్థాన్, టర్కీ కీలక రక్షణ ఒప్పందం కుదుర్చుకోవడం అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది. అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు, గల్ఫ్ ప్రాంతంలో పెరుగుతున్న అనిశ్చితి నేపథ్యంలో మక్కా వేదికగా మూడు దేశాల నేతలు ఈ ఒప్పందాన్ని ఖరారు చేశారు.
ఈ ఒప్పందంలోని ప్రధాన అంశం పరస్పర భద్రత. మూడు దేశాల్లో ఏదైనా ఒక దేశంపై సాయుధ దాడి జరిగితే.. దాన్ని మిగిలిన దేశాలపై జరిగిన దాడిగా పరిగణించేలా నిబంధనలు రూపొందించారు. రక్షణ రంగంలో సమన్వయం, సైనిక సహకారం, ఉమ్మడి వ్యూహాల రూపకల్పనకు ఇది ప్రాధాన్యం ఇస్తుంది. అయితే దాడి జరిగిన ప్రతిసారీ మిగిలిన దేశాలు తప్పనిసరిగా యుద్ధంలోకి దిగాల్సిందేనని అర్థం కాదు.

### ఇరాన్ సెటైర్లు

ఈ ఒప్పందంపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. ఇరాన్ పార్లమెంట్ జాతీయ భద్రత, విదేశీ వ్యవహారాల కమిషన్ సభ్యుడు ఎబ్రహీం రెజాయీ.. టర్కీ, పాకిస్థాన్‌తో కుదుర్చుకున్న ఒప్పందాలు సౌదీకి శాశ్వత భద్రతను అందించలేవని వ్యాఖ్యానించారు.
'అమెరికాతో ఎన్నో ఏళ్లుగా కొనసాగిన సంబంధాలు కూడా సౌదీకి భద్రత ఇవ్వలేదు. అలాంటప్పుడు కాగితపు ఒప్పందాలు ఏం చేస్తాయి?" అంటూ ఆయన వ్యంగ్యంగా ప్రశ్నించారు. సౌదీ తన విధానాలను మార్చుకుంటే ఇతర దేశాల భద్రతా హామీలపై ఆధారపడాల్సిన అవసరం ఉండదని అన్నారు.

### సౌదీకి ఎందుకు కొత్త మిత్రులు?

గతంలో సౌదీ చమురు కేంద్రాలు, కీలక మౌలిక వసతులపై డ్రోన్లు, క్షిపణులతో దాడులు జరిగాయి. ఈ నేపథ్యంలో కేవలం అమెరికాపై ఆధారపడకుండా ఇతర దేశాలతోనూ రక్షణ భాగస్వామ్యాలను బలోపేతం చేయాలని సౌదీ భావిస్తోంది. టర్కీకి బలమైన సైనిక సామర్థ్యాలు ఉండగా.. పాకిస్థాన్ అణ్వాయుధ దేశం కావడం కూడా ఈ భాగస్వామ్యానికి ప్రాధాన్యం పెంచుతోంది.

### భారత్-పాక్ కోణంలోనూ చర్చ

ఈ ఒప్పందం భారత్–పాకిస్థాన్ సంబంధాలపైనా ఆసక్తి రేపుతోంది. భవిష్యత్‌లో పాకిస్థాన్‌పై భారత్ సైనిక చర్య చేపడితే సౌదీ, టర్కీ ఎలా స్పందిస్తాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే ఒప్పందం ఉన్నంత మాత్రాన ఆ రెండు దేశాలు వెంటనే సైనిక ఘర్షణలోకి దిగాల్సిందేనని చెప్పలేం. మొత్తంగా.. అమెరికాపై ఆధారపడిన భద్రతా వ్యూహం నుంచి సౌదీ బహుముఖ రక్షణ భాగస్వామ్యాల వైపు అడుగులు వేస్తున్నట్లు ఈ ఒప్పందం స్పష్టం చేస్తోంది. ఈ కొత్త కూటమి ఆసక్తికరంగా మారింది.

# చట్టవ్యతిరేక చర్యలు ఉపేక్షించం



ముద్ర, అమరావతి:
చట్ట వ్యతిరేకంగా ఏం చేసినా ఉపేక్షించబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. ప్రజల్ని ఇబ్బంది పెట్టేలా బస్టాండ్‌లు, రహదారుల వెంట నిరసనలు చేస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని స్పష్టంచేశారు. గొడ్డలి పార్టీ నిరసనల్లో రౌడీలు, గంజాయ్ బ్యాచ్‌లు తప్ప ఒక్కరైనా డీఎస్సీ అభ్యర్థులు ఉంటున్నారా అని మండిపడ్డారు. కర్నూలులో ఇవాళ కదం తొక్కిన వారంతా మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులేనని తెలిపారు. గొడ్డలి పార్టీ చేసే నష్టం వల్ల.. ఉపాధ్యాయులు ఐక్యంగా తమ ఆత్మగౌరవం చాటారని సీఎం అన్నారు
'ఆర్థిక వ్యవహారాలపై విడుదల చేసిన శ్వేత పత్రం ప్రజల్లోకి బాగా వెళ్లింది. ప్రజెంటేషన్‌పై 10 గంటలు అధ్యయనం చేశా. ఆర్థిక పరిస్థితి ప్రజలకు వివరిస్తేనే అర్థం చేసుకుంటారు. నెలాఖరులోగా రెండు ప్రధాన ప్రాజెక్టులు ప్రారంభిస్తాం. వెలిగొండ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి అనకాపల్లి వరకూ ఈనెలలోనే సాకారం. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వచ్చే ఏడాది విశాఖ వరకూ తీసుకెళ్తాం. ఈ నెలలోనే అమరావతికి సంబంధించి రెండు కీలక ప్రారంభాలు ఉన్నాయి. సీడ్ యాక్సిస్ ప్రారంభంతో పాటు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్స్ అందుబాటులోకి వస్తాయి. వర్షాకాలంలోనూ అమరావతి నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఎగువ ప్రాంతాల్లో వర్షాల వల్ల రెండు రోజుల్లో శ్రీశైలం నిండి, ఆ తర్వాత సాగర్‌కూ నీరొచ్చే అవకాశముంది'' అని సీఎం తెలిపారు.

# భారత్‌కు ట్రంప్ బిగ్ షాక్!

ముద్ర డెస్క్:
రష్యాపై అమెరికా ఆంక్షల యుద్ధం మరో కీలక మలుపు తిరిగింది. రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తున్న దేశాలపై భారీ సుంకాలు విధించే అధికారం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కల్పించే కీలక బిల్లును అమెరికా సెనేట్ భారీ మెజారిటీతో ఆమోదించింది. 'లిండ్సే ఓ. గ్రాహమ్ సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026'గా పిలుస్తున్న ఈ బిల్లు 86–11 ఓట్లతో ఆమోదం పొందింది.
చట్టం అమల్లోకి వస్తే రష్యా నుంచి చమురు, సహజవాయువును అత్యధికంగా కొనుగోలు చేసే ఐదు దేశాల నుంచి అమెరికాకు వచ్చే వస్తువులపై గరిష్ఠంగా 100 శాతం సుంకాలు విధించే అధికారం ట్రంప్ సర్కార్‌కు లభిస్తుంది. జాబితాలో భారత్, చైనా వంటి రష్యా ఇంధన కొనుగోలుదారులు ఉన్నారు. అయితే సుంకాలు వెంటనే అమల్లోకి రావు. ముందుగా అమెరికా ప్రతినిధుల సభ బిల్లును ఆమోదించాలి. అనంతరం చట్టపరమైన ప్రక్రియ పూర్తయిన తర్వాతే ట్రంప్ ఈ అధికారం వినియోగించగలరు. రష్యా ఇంధన ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయాన్ని తగ్గించడం, తద్వారా ఉక్రెయిన్‌పై కొనసాగుతున్న యుద్ధానికి మాస్కోకు లభిస్తున్న ఆర్థిక మద్దతును దెబ్బతీయడమే ఈ చర్య ప్రధాన ఉద్దేశంగా అమెరికా చెబుతోంది. రష్యా చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై ఒత్తిడి పెంచడం ద్వారా మాస్కోపై ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచాలని వాషింగ్టన్ భావిస్తోంది. ఈ బిల్లులో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో పాటు ఉన్నతాధికారులు, సైనిక నాయకులు, ఆర్థిక సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలపై ఆంక్షలకు సంబంధించిన నిబంధనలు ఉన్నాయి. ఆంక్షలను తప్పించుకునేందుకు రష్యా ఉపయోగిస్తున్నట్లు అమెరికా ఆరోపిస్తున్న 'షాడో ఫ్లీట్'పై చర్యలకు అవకాశం కల్పిస్తోంది.




# జీవితమే అసలు పరీక్ష..



(మొదటి పేజీ తరువాయి)
కీలక పాత్ర పోషించాలని అన్నారు. 'ఆత్మనిర్భర్ భారత్' నిర్మాణం లో యువత భాగస్వామ్యం కావాలని మోదీ సూచించారు. కెరీర్‌తో పాటు శారీరక, మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని చెప్పారు. చివరగా.. డిగ్రీతో విద్యార్థుల ప్రయాణం ముగియదని, అసలు పరీక్షలు జీవితంలోనే ప్రారంభమవుతాయని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

## భారత్ స్వతంత్ర విదేశాంగ విధానం కొనసాగించాలి: కూనంనేని

ముద్ర, హైదరాబాద్:
అంతర్జాతీయ వ్యవహారాల్లో భారత్ స్వతంత్ర వైఖరిని కొనసాగిస్తూ దేశ సార్వభౌమత్వం, జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లో ఇస్కాఫ్ కార్యాలయంలో 'ఇరాన్‌పై అమెరికా యుద్ధం–భారత్‌పై ప్రభావం' అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. నెహ్రూ హయాంలో అనుసరించిన అలీన విధానాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికాతో సంబంధాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల భారత్ స్వతంత్ర విదేశాంగ విధానం బలహీనపడకూడదని సూచించారు. ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ మాట్లాడుతూ పశ్చిమాసియా భారత్‌కు ఆర్థిక, ఇంధన, భద్రతాపరంగా అత్యంత కీలకమని పేర్కొన్నారు.

# బోనాల పండుగ వేళ మద్యం బంద్




(మొదటి పేజీ తరువాయి)
ఆగస్టు 9 ఉదయం 10 గంటల నుంచి మరుసటి రోజు (ఆగస్టు 10) ఉదయం 10 గంటల వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయి. అయితే, స్టార్ హోటళ్లు, రిజిస్టర్డ్ క్లబ్బుల్లోని బార్లకు ఈ నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని కూకట్‌పల్లి, అల్లాపూర్, రాయదుర్గం, జీడిమెట్ల, మేడ్చల్, చందానగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మద్యం అమ్మకాలు నిలిపివేయాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు. ఇక, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆగస్టు 9 ఉదయం 10 గంటల నుంచి ఆగస్టు 10 ఉదయం 6 గంటల వరకు మద్యం దుకాణాలు మూసివేయనున్నారు.
బోనాల పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు మూడు కమిషనరేట్ల పోలీసులు స్పష్టం చేశారు. పండుగ వేళ వేల సంఖ్యలో భక్తులు, ప్రజలు రోడ్లపైకి వస్తారని, వారి భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ ఆంక్షలు విధించామని తెలిపారు. ప్రజలు నిబంధనలు పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# పెద్ది కుటుంబానికి రూ.2.25 కోట్లు

ముద్ర హైదరాబాద్ :
బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. 'పెద్ది' కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలిచారు. ఇటీవల నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మృతిచెందగా.. ఆయన కుటుంబానికి పార్టీ తరఫున రెండు కోట్ల 25 లక్షల రూపాయలను కేసీఆర్ ప్రకటించారు. పార్టీ సీనియర్లు, వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో చర్చించి కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలవాలని కేసీఆర్ నిర్ణయించారు. ఇందులో భాగంగా సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో కోటి రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. అదే సమయంలో పెద్ది సుదర్శన్ రెడ్డి తల్లి అమ్మ తమ్మ వృద్ధాప్యంలో ఉన్నందున వారి బాగోగుల కోసం మరో రూ.25 లక్షలను తల్లి పేరు మీద బ్యాంకులో జమ చేయాలని కేసీఆర్ నిర్ణయించారు.
తద్వారా మొత్తంగా 2 కోట్ల 25 లక్షల రూపాయలను పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించి అండగా నిలవాలని బీఆర్ఎస్ నిర్ణయం తీసుకుంది. పిల్లల భవిష్యత్తు, వారి చదువు తదితర కుటుంబ సంక్షేమానికి సంబంధించి పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తూ అండగా నిలుస్తుందని కేసీఆర్ తెలిపారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 09.08.2026
www.mudranews.in | @mudranews



### చేతులు, కాళ్లు గుంజుతుంటే.. పొటాషియం ఉన్న ఆహారం తీసుకోండి

అరటిపండ్లు, కొబ్బరి నీరు, ఆకుకూరలు వంటి పొటాషియం ఉన్న ఆహారాన్ని ఆహారంలో చేర్చుకోవడం కండరాల పనితీరుకు సహాయపడుతుంది. అయితే తరచూ సమస్య ఉంటే వైద్యుల సలహాతో కారణాన్ని తెలుసుకోవాలి.



# సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్లు..

- భూసేకరణ, పునరావాసానికి నిధుల కొరత రానివ్వం
-ఇప్పటికే రూ.2 వేల కోట్లు విడుదల..
- త్వరలో మరో రూ.3 వేల కోట్లు
- అనుమతుల పేరుతో పనులు ఆగొద్దు..
- కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు
- మిడ్‌మానేరు ఎడమ కాలువ పనులు వెంటనే పునఃప్రారంభించాలి
- పత్తిపాక డీపీఆర్ ఆగస్టు నెలాఖరులోగా సిద్ధం
- 96 శాతం పూర్తయిన రోళ్లవాగుకు అటవీ అనుమతులు వేగవంతం
-మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

**ముద్ర, హైదరాబాద్** : రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పునరావాసం–పునర్నిర్మాణం కోసం రూ.5 వేల కోట్లు సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే రూ.2 వేల కోట్లు విడుదలయ్యాయని, మిగిలిన రూ.3 వేల కోట్ల విడుదల ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని సాగునీటి ప్రాజెక్టులపై శనివారం నిర్వహించిన సమీక్షలో మంత్రి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. భూసేకరణ, R&R, అటవీ, పర్యావరణ అనుమతులను అత్యంత ప్రాధాన్య అంశాలు గా తీసుకుని పనుల్లో జాప్యం చేయవద్దని సూచించారు. ఇంజినీరింగ్ పనులతోపాటు భూసేకరణ, పరిహారం, పునరావాస ప్రక్రియలను సమాంతరంగా పూర్తి చేయాలని ఆదేశించారు.



సుమారు నాలుగున్నరేళ్లుగా నిలిచిపోయిన మిడ్‌మానేరు ఎడమ కాలువ పనులను వెంటనే పునఃప్రారంభించాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. అలాగే పెద్దపల్లి జిల్లాలో ప్రతిపాదించిన పత్తిపాక రిజర్వాయర్ ద్వారా కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు అందించడంతోపాటు 2.40 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించేందుకు చర్యలు వేగవంతం చేయాలని సూచించారు.

జగిత్యాల జిల్లా రోళ్లవాగు ప్రాజెక్టు పనులు ఇప్పటికే 96 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను అటవీ అనుమతులు పూర్తిచేసి త్వరగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

ప్రాజెక్టుల వారీగా పెండింగ్ సమస్యలను గుర్తించి, ప్రతి అంశానికి 'యాక్షన్ పాయింట్' రూపొందించాలని అధికారులకు సూచించారు. నిధుల కొరత కారణంగా పూర్తికి చేరువలో ఉన్న ఏ సాగునీటి ప్రాజెక్టు కూడా నిలిచిపోకూడదని ఉత్తమ్ స్పష్టం చేశారు. రైతులకు వీలైనంత త్వరగా సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

సమీక్షలో నాలుగు జిల్లాల కలెక్టర్లతో పాటు ఇంజినీర్–ఇన్–చీఫ్ (జనరల్) ఓ.వి. రమేష్‌బాబు, నీటిపారుదల శాఖ జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు నాయకత్వ శిక్షణ అవసరం

- చంద్రబాబు



**ముద్ర, అమరావతి:** టీడీపీ కేంద్ర కార్యాలయంలో యూనిట్ ఇంఛార్జ్ లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరై ప్రభుత్వ పథకాలు, పార్టీ కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. కార్యకర్తల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకే శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని, తప్పుడు ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలని సూచించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వ్యవస్థలను గాడిలో పెట్టి సంక్షేమం, అభివృద్ధిని కొనసాగిస్తున్నామని చెప్పారు. పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై జీరో టాలరెన్స్ ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతి ఎన్నికల్లోనూ గత ఎన్నికల కంటే ప్రతి బూత్లో ఎక్కువ ఓట్లు సాధించేలా కార్యకర్తలు పనిచేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. యూనిట్, క్లస్టర్ ఇంఛార్జ్ లు, మండల అధ్యక్షులకు తగిన గౌరవం దక్కేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఏప్రిల్ లో ప్లాస్టిక్ నోట్ల విడుదల




**ముద్ర, హైదరాబాద్ :** దీర్ఘకాలం మన్నే పాలిమర్ (ప్లాస్టిక్) కరెన్సీ నోట్లను 2027 ఏప్రిల్ నుంచి పైలట్ ప్రాజెక్టుగా విడుదల చేయనున్నట్లు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించారు. తొలి దశలో రూ.10, రూ.20 నోట్లలో ఒక్కో డినామినేషన్కు 100 కోట్ల చొప్పున మొత్తం 200 కోట్ల నోట్లు చలామణిలోకి రానున్నాయి. ప్లాస్టిక్ నోట్లు పేపర్ నోట్లతో పోలిస్తే 2 నుంచి 4 రెట్లు ఎక్కువ కాలం మన్నుతాయని RBI తెలిపింది. అయితే ప్రస్తుతం ఉన్న కాగితపు నోట్లను పూర్తిగా తొలగించే ఆలోచన లేదని, రెండు రకాల నోట్లు చెల్లుబాటులోనే ఉంటాయని స్పష్టం చేసింది.

# జర్నలిజానికి, వర్కింగ్ జర్నలిస్టులకు రక్షణ అవసరం

### ఐజేయూ సదస్సులో వక్తలు

**ముద్ర న్యూస్ బ్యూరో, బెంగళూరు, ఆగస్టు 8:** ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) అనుబంధ సంఘమైన కర్ణాటక స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ ఆధ్వర్యంలో "జర్నలిజానికి, వర్కింగ్ జర్నలిస్టులకు రక్షణ అవసరమా?" అనే అంశంపై శనివారం బెంగళూరులో సదస్సు జరిగింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకాగా, ది వైర్ వ్యవస్థాపక సంపాదకుడు సిద్ధార్థ వరదరాజన్ కీలక ప్రసంగం చేశారు.






సదస్సులో జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ 2020లో రెండు జర్నలిస్టుల చట్టాలతో సహా మొత్తం 13 చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని చెప్పారు. ఈ చట్టాలను రద్దు చేయడానికి పార్లమెంటులో ఎటువంటి నిర్దిష్ట కారణాన్ని వెల్లడించలేదని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి చట్టాల రద్దును న్యాయస్థానంలో సవాలు చేసేందుకు ఏదైనా చట్టపరమైన అవకాశం ఉందా అని ఆయన ప్రశ్నించారు.

మీడియా ప్రేక్షక పాత్ర కాకుండా రిఫరీ పాత్రను పోషించాలని జస్టిస్ సుదర్శన్ రెడ్డి సూచించారు. ప్రస్తుతం జర్నలిజం పరిస్థితిపై ఆయన ఆందోళన వ్యక్తం చేస్తూ నూతన తరానికి చెందిన, డిజిటల్ మీడియా జర్నలిస్టులు తాము రిపోర్ట్ చేసే అంశాలు, సమస్యలపై లోతైన అధ్యయనం చేసి, వాస్తవాలపై సమగ్ర అవగాహన పెంచుకోవాలని సూచించారు. దీనివల్ల మీడియా విశ్వసనీయత గణనీయంగా పెరుగుతుందని ఆయన చెప్పారు. "జర్నలిస్టులకు రక్షణ అవసరం అనడంలో ఎలాంటి సందేహం లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు.

సిద్ధార్థ వరదరాజన్ మాట్లాడుతూ "భారతదేశంలో జర్నలిజానికి, జర్నలిస్టులకు రక్షణ అవసరం" అని కచ్చితంగా చెప్పారు. గతంలో వివాదాస్పద, ఘర్షణాత్మక అంశాలను రిపోర్ట్ చేసే జర్నలిస్టులు ఎదుర్కొనే ప్రధాన ముప్పుల్లో పరువునష్టం కేసులు ఒకటిగా ఉండేవని ఆయన అన్నారు. అయితే ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయని, జర్నలిస్టులు దేశద్రోహం, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ)తో పాటు ఇతర తీవ్రమైన చట్టాల కింద కేసులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కర్ణాటక మీడియా అకాడమీ చైర్‌పర్సన్ ఆయేషా ఖానుమ్ మాట్లాడుతూ, జర్నలిస్టులు ఐక్యంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఐజేయు మాజీ అధ్యక్షుడు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, స్వాతంత్రోద్యమ అనంతరం నాయకులు జర్నలిస్టుల హక్కుల కోసం, వారి పని పరిస్థితులు మెరుగుపరచడంపై దృష్టి సారించారని, నేటి నాయకులు మీడియా హక్కుల హననంపై ఆసక్తి చూపుతున్నారని అన్నారు. జర్నలిస్టులకు సంబంధించిన రెండు చట్టాల తో పాటు 13 చట్టాలను రద్దుచేసి, 29 చట్టాలతో కూడిన 4 కార్మిక స్మృతులకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఆరు జాతీయ సమ్మెలకు మద్దతు ఇచ్చామని, రద్దుకు వ్యతిరేకంగా పార్లమెంటరీ కమిటీకి సైతం వినతి పత్రం ఇచ్చామని గుర్తు చేశారు. నాలుగు కోడ్స్ నోటిఫికేషన్ను అమలు చేయకుండా నిలిపేసిన కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల స్ఫూర్తిని అభినందించారు. ఈ సెమినార్ ఐజెయు భవిష్యత్ కార్యాచరణకు దిశ నిర్దేశం చేస్తున్నదని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆగస్టు 8, 9 తేదీల్లో బెంగళూరులో జరుగుతున్న ఐజేయూ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో భాగంగా ఈ సదస్సును నిర్వహించారు. ఐజేయూ అధ్యక్షుడు బల్విందర్ సింగ్ జమ్మూ సదస్సుకు అధ్యక్షత వహించారు. ఐజేయూ సెక్రటరీ జనరల్ డి. సోమసుందర్ స్వాగతోపాన్యాసం చేశారు. ఐజేయూ మాజీ అధ్యక్షులు ఎస్.ఎన్. సిన్హా, దేవులపల్లి అమర్, సీనియర్ జర్నలిస్ట్ అబ్దుల్ రజాక్ కూడా సదస్సులో ప్రసంగించారు. ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యు డు ఎం ఏ మాజీద్, ఉపాధ్యక్షుడు వై నరేందర్ రెడ్డి, టీయూ డబ్ల్యూజే అధ్యక్షుడు కె విరాహత్ అలీ, ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కె జయరాజ్,జాతీయ కార్యవర్గ సభ్యులు కే సత్యనారాయణ, కూన అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఐజేయూ జాతీయ కార్యవర్గ సమావేశం ప్రారంభ సెషన్‌ను జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి, సిద్ధార్థ వరదరాజన్ తదితర ప్రముఖులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా హాజరైన ప్రముఖులందరినీ కర్ణాటక స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ సత్కరించింది. కర్ణాటక స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ అధ్యక్షురాలు జానకి మోహన్ వందన సమర్పణ చేశారు.

## ఎస్ఐఆర్ ఫేజ్-2పై బీజేపీ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్




**ముద్ర, హైదరాబాద్** : తెలంగాణలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) రెండో విడత ప్రక్రియపై ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో బీజేపీ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. SIR రాష్ట్ర కన్వీనర్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుతో పాటు రాష్ట్ర పదాధికారులు పాల్గొన్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కూడా వర్క్‌షాప్‌లో పాల్గొని SIR ఫేజ్–2 ప్రక్రియపై చర్చించారు.

## బాల్యం నుంచే సమానత్వం బోధించాలి




**ముద్ర, హైదరాబాద్** : పిల్లలకు చిన్నప్పటి నుంచే సమానత్వం, పరస్పర గౌరవం, సమ్మతి విలువలను నేర్పించాలని వక్తలు సూచించారు. #StandWithHer ఆరో విడతలో భాగంగా హైదరాబాద్‌లోని వీహబ్‌లో నిర్వహించిన ప్యానెల్ చర్చలో నటి అమల అక్కినేని, దర్శకురాలు నందిని రెడ్డి, సీఐడీ, ఏసీబీ, మహిళా భద్రత విభాగాల డీజీ చారు సిన్హా తదితరులు పాల్గొన్నారు.తల్లిదండ్రులు పిల్లలతో నిత్యం మాట్లాడటం, వారి భావోద్వేగాలను గౌరవించడం ద్వారా నమ్మకాన్ని పెంచాలని సూచించారు. 'నో' చెప్పడం మాత్రమే కాకుండా, ఇతరులు చెప్పే 'నో'ను గౌరవించడం కూడా అబ్బాయిలకు నేర్పాలని ప్రొఫెసర్ అనురేఖ చారి వాఘ్ అన్నారు. పిల్లలు పెద్దల ప్రవర్తనను అనుకరిస్తారని, అందువల్ల తల్లిదండ్రులే మంచి విలువలకు ఆదర్శంగా నిలవాలని వక్తలు పేర్కొన్నారు.

## హైడ్రాలో ఉద్యోగాల భర్తీకి పోటెత్తిన యువత

ముద్ర, హైదరాబాద్ : ఎల్బీనగర్ పరిధిలోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్దకు యువత భారీగా తరలి రావడంతో ఉద్రిక్తత నెలకొంది. హైడ్రాలో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఉదయం నుంచే స్టేడియం వద్దకు చేరుకున్నారు. సమయం గడిచేకొద్దీ అభ్యర్థుల సంఖ్య భారీగా పెరగడంతో స్టేడియం పరిసరాల్లో తీవ్ర రద్దీ నెలకొంది. ఉద్యోగాల కోసం వచ్చిన వారు పెద్ద సంఖ్యలో క్యూ లైన్లలో నిల్చున్నారు. ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించాలని నిరుద్యోగులు డిమాండ్ చేశారు. యువత భారీగా తరలిరావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా స్టేడియం వద్ద భద్రతను ఏర్పాటు చేశారు. దరఖాస్తుదారుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉండటంతో పోలీసులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

## కాంగ్రెస్‌లో అలజడి వాతావరణం..

- రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**ముద్ర, హైదరాబాద్** : కాంగ్రెస్ పార్టీలో మరోసారి రాజకీయ అలజడి నెలకొన్నట్లుగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. గతంలో తాను తీసుకున్న రాజీనామా నిర్ణయాన్ని ప్రస్తావిస్తూ ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.రాహుల్ గాంధీ చెప్పిన మాటను తాను వినకపోవడంతోనే అప్పట్లో రాజీనామా చేశానని రాజగోపాల్ రెడ్డి తెలిపారు. తాను రాజీనామా చేసిన తర్వాతే పరిస్థితుల్లో కదలిక వచ్చిందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతోనే నాడు కేసీఆర్‌కు వ్యతిరేకంగా రాజీనామా చేసినట్లు ఆయన స్పష్టం చేశారు.తన రాజీనామా వెనుక ఎలాంటి స్వార్థ ప్రయోజనం లేదని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆ నిర్ణయం తీసుకున్నానని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో చర్చకు దారితీశాయి. పార్టీ అంతర్గత వ్యవహారాలు, గతంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలపై ఆయన వ్యాఖ్యలు మరోసారి రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

## శాస్త్రోక్తంగా దేవతా చిత్రపటాల ఉత్థారణ





ముద్ర, బోడుప్పల్: మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని మల్లికార్జున స్వామి ఆలయంలో శనివారం మున్సిపల్ అధికారుల సమక్షంలో శాస్త్రోక్తంగా దేవతా చిత్రపటాల ఉత్థారణ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎ.శైలజ, అసిస్టెంట్ ఇంజినీర్ (ఎస్ డబ్ల్యుఎం) మహేష్, శానిటరీ ఇన్ స్పెక్టర్ ప్రవీణ్ తో పాటు ఇతర మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగింది. ఆలయ ఆవరణలో నేలపై వరుసగా పేర్చిన చిత్రపటాలకు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం, ఆయా చిత్రపటాల ఫ్రేములను విడదీశారు. తర్వాత పటాలను, అద్దాలను, ఫ్రేములను వేరు చేసి నిబంధనల ప్రకారం వాటిని నిర్వహించడానికి చర్యలు తీసుకున్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు, ప్రజల విశ్వాసాలు, ఆధ్యాత్మిక భావాలను గౌరవిస్తూ మున్సిపల్ అధికారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## హిల్ట్ పాలసీపై సెప్టెంబర్‌లో అవగాహన కార్యక్రమాలు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**ముద్ర, హైదరాబాద్** : హైదరాబాద్ పారిశ్రామిక ప్రాంతాల్లోని భూములను బహుళ వినియోగ జోన్లుగా మార్చే హిల్ట్ పాలసీపై సెప్టెంబర్‌లో పారిశ్రామిక అసోసియేషన్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. హిల్ట్ పేరుతో 10 వేల ఎకరాల భూములను ధారాదత్తం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ పాలసీ కింద ఎవరూ డబ్బులు చెల్లించి నష్టపోవద్దని పారిశ్రామికవేత్తలను హెచ్చరించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే హిల్ట్ పాలసీని రద్దు చేస్తామని స్పష్టం చేశారు. మరోవైపు, రైతులు, సాగునీటి అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణ కోసం కేసీఆర్ నాయకత్వంలో భారీ ఉద్యమం చేపడతామని అన్నారు. హైడ్రా పేరుతో ప్రభుత్వం పేదలపై భారం మోపుతోందని ఆరోపించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
ఆదివారం 09.08.2026



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# ఇల్లు బలంగా ఉండాలంటే

## సిమెంట్, మట్టి, ఫ్లై యాష్ ఇటుకల్లో ఏది బెస్ట్?




సొంతిల్లు నిర్మించుకోవడం ప్రతి ఒక్కరి కల. అయితే ఆ కలను సాకారం చేసుకునే సమయంలో సరైన నిర్మాణ సామగ్రిని ఎంచుకోవడం అత్యంత అవసరం. ముఖ్యంగా ఇల్లు బలంగా ఉండాలంటే ఇటుకల నాణ్యతపై ఆధారపడి ఉంటాయి. సాధారణంగా ఇల్లు నిర్మాణానికి ఎర్ర ఇటుకలు వాడుతారు. కానీ ప్రస్తుతం మార్కెట్లో సిమెంట్ ఇటుకలు, ఫ్లై యాష్ ఇటుకలు, ప్లాస్టిక్ ఇటుకలు అందుబాటులోకి వచ్చాయి. నేటి తరం వారు ఈ మూడు రకాల ఇటుకలతో అయోమయానికి గురవుతున్నారు. వీటిలో ఏది బెస్ట్ అని తేల్చుకోలేకపోతున్నారు. కొందరు భవన రంగ నిపుణులు తెలుపుతున్న ప్రకారం.. ఏది బెస్టో చూద్దాం..

### ఎర్ర ఇటుకలు:

ఇంటి నిర్మాణానికి ఎర్ర ఇటుకలను ఎక్కువ కాలంగా వినియోగిస్తున్నారు. వీటిని మట్టిని తయారు చేసి అధిక ఉష్ణోగ్రత వద్ద కాల్చడం వల్ల ఇవి బలంగా ఉంటాయని అంటుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ ఎక్కువగా వీటినే ఉపయోగిస్తారు. ఈ ఇటుకలు వేడిని అడ్డుకుని ఇంటిని చల్లగా ఉంచడంలో సహాయపడతాయి. సాధారణ నిర్మాణాలకు అనువైన ఎంపిక. అయితే నాణ్యత ప్రాంతాన్ని బట్టి మారే అవకాశం ఉంది. నాణ్యత లోపిస్తే ఇంటి నిర్మాణంలో పగుళ్లు వచ్చే అవకాశం ఉంది. ఈ ఇటుకలు నీటిని ఎక్కువగా పీల్చుకుంటాయి.

### సిమెంట్ ఇటుకలు

సిమెంట్, ఇసుక, కంకర కలయికతో యంత్రాల సహాయంతో ఈ ఇటుకలను తయారు చేస్తారు. ఇవి దాదాపు అన్నీ ఒకే పరిమాణంలో ఉంటాయి. కాబట్టి నిర్మాణంలో ఖచ్చితత్వం ఎక్కువగా ఉంటుంది. ఇవి నీటిని తక్కువగా పీల్చుకుంటాయి. ఈ ఇటుకలతో నిర్మాణ పనులు వేగంగా పూర్తవుతాయి. నిర్వహణ ఖర్చుకూడా తక్కువగా ఉంటుంది. అయితే వేడి నిరోధకత ఎర్ర ఇటుకలతో పోలిస్తే కొంత తక్కువగా ఉంటుంది. నాణ్యత కోసం సరైన మిశ్రమంతో తయారైన ఇటుకలనే ఎంచుకోవాలి.

### ఫ్లై యాష్ ఇటుకలు:

థర్మల్ పవర్ ప్లాంట్ల నుంచి వచ్చే ఫ్లై యాష్, సిమెంట్, సున్నం, జిప్సం వంటి పదార్థాలతో తయారు చేసే ఇటుకలను ఫ్లై యాష్ ఇటుకలు అంటారు. ప్రస్తుతం ఆధునిక నిర్మాణాల్లో వీటి వినియోగం ఎక్కువగా ఉంటోంది. ఈ ఇటుకల బరువు తక్కువగా ఉంటుంది. ఉపరితలం సమతలంగా ఉండడంతో ప్లాస్టరింగ్ ఖర్చు తగ్గుతుంది. ఇవి నీటిని తక్కువగా పీల్చుకోవడంతో క్యూరింగ్ సమస్యలు ఉండవు. పరిమాణాలు ఖచ్చితంగా ఉండడంతో భవన నిర్మాణం త్వరగా పూర్తి చేసుకోవచ్చు. అయితే ఇవి అన్ని ప్రాంతాల్లో అందుబాటులో ఉండకపోవచ్చు. ఒకవేళ వీటిని కోరుకుంటే నాణ్యత కలిగినవే ఎంచుకోవాలి.

ఇంటి నిర్మాణానికి ఏ ఇటుకలు ఉపయోగించాలనేది బడ్జెట్, ప్రాంతీయ వాతావరణం, నిర్మాణ నమూనా, ఇంజినీర్ సూచనలు వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. సంప్రదాయ నిర్మాణాలకు ఎర్ర ఇటుకలు ఇప్పటికీ మంచి ఎంపిక. ఖచ్చితమైన పరిమాణాలు, తక్కువ ప్లాస్టరింగ్ ఖర్చు, పర్యావరణహిత నిర్మాణం కోరుకునే వారికి ఫ్లైయాష్ ఇటుకలు ఉత్తమ ఎంపికగా భావిస్తారు.



# గరీబ్ కా బాదం

## పల్లీలు - పేదవాడి ఆరోగ్య నిధి

మన ఆహారపు అలవాట్లలో, నిత్య జీవితంలో అతి సాధారణంగా కనిపించే గింజలలో పల్లీలు (వేరుశనగలు) ఒకటి. ఇవి అందరికీ అందుబాటులో ఉండే సామాన్యమైన తినుబండారమే అయినప్పటికీ, వీటిలో దాగి ఉన్న పోషకాలు మాత్రం అత్యంత విలువైనవి. అందుకే పల్లీలను ప్రేమగా 'గరీబ్ కా బాదం' (పేదవాడి బాదం) అని పిలుస్తుంటారు.



### 'గరీబ్ కా బాదం' అని ఎందుకు పిలుస్తారు?

ధర విషయానికి వస్తే బాదం పప్పులు చాలా ఖరీదైనవి, కానీ పల్లీలు చాలా చవకగా, ప్రతి ఒక్కరికీ సులభంగా లభిస్తాయి. విటమిన్లు, ప్రొటీన్ల విషయంలో బాదం ఇచ్చే పోషక విలువలతో పల్లీలు దాదాపు సమానంగా పోటీపడతాయి. తక్కువ ఖర్చుతో బాదం అందించే పోషక ప్రయోజనాలను పల్లీల ద్వారా పొందవచ్చు కాబట్టే వీటికీ పేరు వచ్చింది.

### పల్లీలలో ఉండే పోషక విలువలు

పల్లీలు 'చిన్న గింజ – పెద్ద ఆరోగ్యం' అనే నానుడికి సరిగ్గా సరిపోతాయి. వీటిలో

**ప్రోటీన్:** శరీర కండరాల నిర్మాణానికి మరియు బలానికి సహాయపడుతుంది

**ఆరోగ్యకరమైన కొవ్వులు:** శరీరానికి అవసరమైన మంచి కొవ్వులు లభిస్తాయి

**విటమిన్లు & ఖనిజాలు:** విటమిన్ E, మెగ్నీషియం వంటి ముఖ్యమైన పోషకాలు లభిస్తాయి

### ఆరోగ్య ప్రయోజనాలు

రోజూ క్రమం తప్పకుండా పల్లీలను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయి

**గుండె ఆరోగ్యం:** పల్లీలలోని పోషకాలు గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో మేలు చేస్తాయి

**తక్షణ శక్తి:** పని ఒత్తిడిలో ఉన్నప్పుడు లేదా అలసటగా అనిపించినప్పుడు ఇవి శరీరానికి తక్షణ శక్తిని ఇస్తాయి

**బరువు నియంత్రణ:** ఇవి తిన్న తర్వాత కడుపు నిండిన భావన కలిగి, అతిగా తినకుండా బరువు నియంత్రణలో సహాయపడతాయి

**చర్మం, జుట్టు సంరక్షణ:** విటమిన్ E వల్ల చర్మం మెరిసిపోవడమే కాకుండా, జుట్టు ఆరోగ్యానికి కూడా ఎంతో మంచిది

### ఎంత మొత్తంలో తీసుకోవాలి?

ఆరోగ్య ప్రయోజనాలు పూర్తిగా పొందడానికి రోజుకు ఒక గుప్పెడు (సుమారు 25 నుండి 50 గ్రాములు) పల్లీలు తీసుకోవడం శ్రేయస్కరం. నానబెట్టిన పల్లీలు లేదా వేయించిన పల్లీలను మితంగా తింటే ఆరోగ్యానికి చాలా మంచిది.

ముగింపు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలను అందించే పల్లీలు నిజంగా ప్రకృతి మనకిచ్చిన గొప్ప వరం. "చవకైనవి.. చక్కని పోషకాలు.. ఆరోగ్యానికి చాలా మేలు!" చేసే పల్లీలను మన దినచర్యలో భాగం చేసుకుని ఆరోగ్యకరమైన జీవితాన్ని గడుపుదాం.

# స్నాక్స్ తింటే జరిగేది ఇదే

స్నాక్స్ అంటే ఇష్టం లేని వారుండరు! సాయంత్రం వేళ టీతో పాటు వేడి వేడి సమోసా, వడపావ్, లేదా నోరూరించే గులాబ్ జామ్ తినాలనే కోరికను చాలా మంది అదుపు చేసుకోలేరు. కానీ, ఈ చిన్న చిన్న రుచికరమైన తినుబండారాలు మన ఆరోగ్యంపై ఎంతటి ప్రభావాన్ని చూపుతాయో చాలా మందికి తెలియదు.



ఈ నేపథ్యంలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ మనన్ వరా చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రుచిని ఆస్వాదిస్తూనే ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే మనం ఎంత కష్టపడాలో ఆయన చాలా స్పష్టంగా వివరించారు.

**ఒక సమోసా లేదా వడపావ్**
క్యాలరీలు: సుమారు 250
కరిగించడానికి అవసరమైన నడక: కనీసం 50 నిమిషాలు

**ఒక స్లైస్ కేక్**
క్యాలరీలు: 285
కరిగించడానికి అవసరమైన నడక: సుమారు 55 నిమిషాలు

**ఒక లడ్డూ లేదా పెద్ద స్వీట్**
క్యాలరీలు: 330
కరిగించడానికి అవసరమైన నడక: ఒక గంటకు పైగా

**ఒక గులాబ్ జామ్**
క్యాలరీలు: 180
కరిగించడానికి అవసరమైన నడక: 35 నిమిషాల నడక

**ఒక ప్లేట్ చోలే భతురే**
క్యాలరీలు: 600
కరిగించడానికి అవసరమైన నడక: రెండు గంటల సుదీర్ఘ వాక్

### డాక్టర్ వరా నుంచి 'స్మార్ట్ ఈటింగ్ టిప్'

డాక్టర్ మనన్ వరా ప్రజలకు ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇచ్చారు. ఆయన ప్రకారం, మీరు మీ ఇష్టమైన ఆహారాలను పూర్తిగా వదులుకోవాల్సిన అవసరం లేదు. కానీ మీరు తినే వాటిని తగిన విధంగా బ్యాలెన్స్ చేయడం అనేది తప్పనిసరి. "మీరు ఆహారం తీసుకున్న వెంటనే శరీరానికి అవసరమైన కదలిక ఇవ్వకపోతే, ఆ క్యాలరీలు కొవ్వుగా మారి ముప్పు కలిగిస్తాయి," అని హెచ్చరించారు. ఈ 'స్మార్ట్ ఈ టింగ్ టిప్' సోషల్ మీడియాలో విపరీతంగా పంచుకోబడుతోంది. చాలా మంది నెటిజన్లు "తింటాం కానీ వాక్ మిస్ అవ్వకూడదు" అని స్పందిస్తున్నారు.

రుచిని ఆస్వాదిస్తూనే ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే, 'తినడం – నడవడం' అనే సూత్రాన్ని మన దినచర్యలో భాగం చేసుకోవడం అత్యవసరం. కాబట్టి, ఇకపై స్నాక్స్ తీసుకునే ముందు, ఆ తర్వాత ఎంత సమయం నడవాలో గుర్తుంచుకోవాలి.

# మనుషుల్లో నిజమే.. సిక్స్త్ సెన్స్

మనుషులకు సాధారణంగా ఐదు ఇంద్రియాలు చూపు, వినికిడి, స్పర్శ, రుచి, వాసన ఉంటాయని మనకు తెలుసు. వీటి ద్వారానే బాహ్య ప్రపంచాన్ని మనం గ్రహిస్తాం. అయితే వీటన్నింటికీ మించి 'సిక్స్త్ సెన్స్' కూడా ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సినిమాల్లో చూపించేలా ఇది భవిష్యత్తును ముందే ఊహించే శక్తో, లేదా దయ్యాలు, భూతాలను చూసే అద్భుత సామర్థ్యమో కాదు. ఇది మన శరీరానికి సంబంధించిన ఒక అద్భుతమైన జీవసంబంధ వ్యవస్థ. శాస్త్రీయ పరిభాషలో దీనిని "ఇంటెరోసెప్షన్" అని పిలుస్తారు. తాజా పరిశోధనల ప్రకారం ఈ అంతర్గత జ్ఞానమే మనల్ని శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తోంది.

### అసలు 'ఇంటెరోసెప్షన్' అంటే ఏమిటి?

బాహ్య ప్రపంచంలో జరిగే మార్పులను గ్రహించడానికి ఐదు ఇంద్రియాలు తోడ్పడితే.. మన శరీరంలోపల జరిగే మార్పులను గ్రహించి, మెదడుకు చేరవేసే వ్యవస్థనే ఇంటెరోసెప్షన్ అంటారు.

ఆకలి, దాహం వేయడం.. శరీరానికి ఇంధనం, నీరు అవసరమని గుర్తించడం.. గుండె చప్పుడు, శ్వాసలో మార్పులు.. ఆందోళన లేదా శారీరక శ్రమ పెరిగినప్పుడు గుండె వేగం పెరగడాన్ని గమనించడం.. చలి లేదా వేడిని లోపలి నుంచి గ్రహించడం.. శరీరానికి విశ్రాంతి కావాలని లేదా ఎక్కడైనా గాయం జరిగిందని మెదడు అలర్ట్ చేయడం.. ఈ సంకేతాలన్నీ ఇంటెరోసెప్షన్‌లో భాగమే. మన అంతర్గత అవయవాల నుంచి నిరంతరం మెదడుకు అందుతున్న ఈ సమాచారమే మన జీవక్రియను సమతుల్యంగా ఉంచుతుంది.

### మానసిక ఆరోగ్యానికి రక్షణ కవచం

పరిశోధకుల అభిప్రాయం ప్రకారం.. ఈ 'సిక్స్త్ సెన్స్' కేవలం శారీరక అవసరాలకే పరిమితం కాదు, మన ఎమోషనల్ హెల్త్ ను కూడా శాసిస్తుంది. ఎవరైతే తమ శరీర అంతర్గత సంకేతాలను వేగంగా, స్పష్టంగా గుర్తించగలరో వారు తమ భావోద్వేగాలను చాలా బాగా నియంత్రించగలరు. కోపం, భయం, ఆందోళన వంటివి మొదలవుతున్నప్పుడే వారి శరీరం పంపే సంకేతాలను బట్టి వారు త్వరగా కోలుకుంటారు. దీనికి విరుద్ధంగా.. ఈ సామర్థ్యం బలహీనంగా ఉన్న వారిలో మానసిక సమస్యలు తలెత్తే అవకాశం ఎక్కువ. శరీరం పంపే ఒత్తిడి సంకేతాలను సరిగ్గా గుర్తించలేకపోవడం వల్ల ఆందోళన, డిప్రెషన్, ఈటింగ్ డిజార్డర్స్ వంటి సమస్యల బారిన పడే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

### మీ 'సిక్స్త్ సెన్స్'ను ఎలా పెంచుకోవచ్చు

మంచి విషయమేమిటంటే ఈ అంతర్గత గ్రహణ శక్తిని మనం నిరంతర సాధన ద్వారా మెరుగుపరుచుకోవచ్చు. రోజులో కొంత సమయం ఏకాగ్రతతో ధ్యానం చేయడం వల్ల శరీరంలో జరిగే సూక్ష్మ మార్పులను గమనించే శక్తి పెరుగుతుంది. లోతైన శ్వాస తీసుకోవడం, వదలడం ద్వారా హృదయ స్పందనల రేటును గమనించవచ్చు. తల నుండి కాళ్ల వేళ్ల వరకు శరీరం ఎలా ఉందో ప్రతి భాగాన్ని మానసికంగా గమనించే ప్రక్రియ ఇంటెరోసెప్షన్‌ను పెంచుతుంది.



మొత్తంగా చూస్తే.. శాస్త్రవేత్తలు నిరూపించిన 'సిక్స్త్ సెన్స్' అనేది ఎలాంటి అతీంద్రియ మాయాజాలం కాదు. అది మన శరీరంలోనే దాగున్న ఒక అద్భుతమైన రక్షణ వ్యవస్థ. మన శరీరం మనతో ఏం మాట్లాడటానికి ప్రయత్నిస్తుందో నిశితంగా గమనించడం, దానికి తగినట్లుగా స్పందించడం అలవాటు చేసుకుంటే.. శారీరక దృఢత్వంతో పాటు అపారమైన మానసిక ప్రశాంతతను సొంతం చేసుకోవచ్చు. శరీరం పంపే సంకేతాలను నిర్లక్ష్యం చేయకుండా, వాటిని గౌరవించడమే నిజమైన ఆరోగ్యం

# వైఫల్యం నుంచి విజయం

## వయాగ్రా ఆవిష్కరణ ఒక అద్భుత గాథ

వైద్య శాస్త్ర చరిత్రలో కొన్ని ఆవిష్కరణలు ప్రణాళికాబద్ధంగా జరిగితే మరికొన్ని మాత్రం ఊహించని మలుపుల ద్వారా వెలుగులోకి వస్తాయి. శాస్త్రవేత్తలు ఒక లక్ష్యం కోసం అన్వేషణ సాగిస్తుంటే ప్రకృతి వారికి మరొక అద్భుతమైన పరిష్కారాన్ని బహుమతిగా ఇస్తుంది. దీనినే విజ్ఞాన శాస్త్ర భాషలో 'సెరెండిపిటీ' అంటారు. ప్రపంచ వ్యాప్తంగా విప్లవాత్మక మార్పులు తెచ్చిన 'వయాగ్రా' (Viagra) కథ.

### అన్వేషణ మొదలైంది ఇలా..

1990వ దశకంలో ప్రముఖ అంతర్జాతీయ ఔషధ సంస్థ ఫైజర్ శాస్త్రవేత్తలు హృదయ సంబంధిత వ్యాధులకు సమర్థవంతమైన మందును కనుగొనే పనిలో పడ్డారు. ముఖ్యంగా 'అంజైనా పెక్టోరిస్' అనే సమస్యతో బాధపడే వారి కోసం 'సిల్డెనాఫిల్' అనే రసాయనాన్ని అభివృద్ధి చేశారు. గుండెకు రక్తప్రసరణ తగ్గడం వల్ల వచ్చే తీవ్రమైన ఛాతి నొప్పిని తగ్గించడం దీని ప్రధాన ఉద్దేశ్యం. రక్తనాళాలను వ్యాకోచింపజేయడం ద్వారా రక్తప్రవాహాన్ని సులభతరం చేయడం ఈ మందు పనితీరు.

### సైడ్ ఎఫెక్టే సంజీవనిగా!

బ్రిటన్‌లోని స్వాన్సీ ఆసుపత్రిలో ఈ మందుపై క్లినికల్ ట్రయల్స్ నిర్వహిస్తున్నప్పుడు శాస్త్రవేత్తలు ఒక వింత ధోరణిని గమనించారు. గుండె నొప్పి తగ్గించడంలో ఈ మందు ఆశించిన స్థాయిలో ఫలితాలను ఇవ్వలేదు. అయితే ఈ మందును వాడిన పురుష రోగుల్లో ఒక వింతైన 'దుష్ప్రభావం' కనిపించింది. అది వారిలో బలమైన అంగస్తంభన కలిగించడం. సాధారణంగా ఏదైనా మందు వాడినప్పుడు అవాంఛిత ప్రభావాలు కనిపిస్తే దానిని విఫల ప్రయోగంగా భావిస్తారు. కానీ ఫైజర్ శాస్త్రవేత్తలు అలా చేయలేదు. ఆ సైడ్ ఎఫెక్ట్ వెనుక ఉన్న జీవక్రియను లోతుగా అధ్యయనం చేశారు. సిల్డెనాఫిల్ రసాయనం శరీరంలోని పీడీఈ5 అనే ఎంజైమ్‌ను నిరోధించడం ద్వారా పురుషాంగంలోని రక్తనాళాలకు రక్తప్రసరణను గణనీయంగా పెంచుతోందని వారు గుర్తించారు.




### వయాగ్రాగా రూపాంతరం

గుండె జబ్బుల కోసం రూపొందించిన మందు పురుషుల అంగస్తంభన లోపం అనే అతిపెద్ద సామాజిక, వ్యక్తిగత సమస్యకు పరిష్కారంగా మారుతుందని ఎవరూ ఊహించలేదు. 1998లో అమెరికాలోని ఎఫ్‌డీఏ ఈ మందును ఆమోదించడంతో 'వయాగ్రా' అధికారికంగా మార్కెట్‌లోకి ప్రవేశించింది. తక్కువ కాలంలోనే ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందింది. ఒక మందుగానే కాకుండా ప్రపంచం మాట్లాడటానికి సంకోచించే 'లైంగిక ఆరోగ్యం' అనే అంశంపై చర్చకు దారితీసింది.

### సామాజిక ప్రభావం.. పాఠాలు

వయాగ్రా ఆవిష్కరణ కేవలం వైద్య రంగంలోనే కాదు.. సామాజిక దృక్పథంలోనూ మార్పు తెచ్చింది. ఒక లక్ష్యం కోసం చేసిన ప్రయోగం విఫలమైనా, ఆ ఫలితాలను మరో కోణంలో చూడటం వల్ల కొత్త ఆవిష్కరణలు సాధ్యమని నిరూపితమైంది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 09.08.2026
www.mudranews.in | @mudranews



### చేతులు, కాళ్లు గుంజుతుంటే..

ఎక్కువసేపు ఒకే భంగిమలో ఉండొద్దు. ఎక్కువసేపు కూర్చోవడం, నిలబడటం లేదా ఒకే పొజిషన్‌లో ఉండటం వల్ల కండరాలపై ఒత్తిడి పెరగొచ్చు. మధ్యమధ్యలో నడవడం, చేతులు కాళ్లను కదిలించడం అలవాటు చేసుకోవాలి.



# ఏఐతో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

**నేషనల్ హెల్త్ సమ్మిట్‌లో నిపుణుల కీలక వ్యాఖ్యలు**

**ముద్ర, హైదరాబాద్:** కృత్రిమ మేధస్సు (ఏఐ) వైద్య రంగంలో కీలక మార్పులకు దారితీస్తోందని నేషనల్ హెల్త్ సమ్మిట్‌లో పాల్గొన్న వైద్య నిపుణులు తెలిపారు. వ్యాధులను ముందుగానే గుర్తించడం, అధునాతన వైద్య పరీక్షలు, చికిత్స ప్రణాళిక, రోబోటిక్ సర్జరీ వంటి విభాగాల్లో ఏఐ వినియోగం వేగంగా పెరుగుతోందన్నారు.బ్లెస్ ఫుల్ డాక్టర్స్, బ్లిస్‌బర్గ్ ఫ్యూచర్ ఆఫ్ హోప్ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యుడు డా. హరికుమార్ నాయకత్వంలో ఈ సదస్సు నిర్వహించారు. వైద్యులు, ఆరోగ్య నిపుణులు, సామాజిక కార్యకర్తలు, సాంకేతిక రంగ నిపుణులు పాల్గొని భవిష్యత్ వైద్య రంగంపై చర్చించారు.ఏఐ అందరికీ అందుబాటులోకి రావాలి నేషనల్ బీసీ దళ్ అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త దుంద్ర కుమారస్వామి మాట్లాడుతూ ఏఐ ఆధారిత వైద్య సేవల ప్రయోజనాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. సాంకేతిక అభివృద్ధితో పాటు మానవ విలువలు, రోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.మాజీ ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ మిశ్రా మాట్లాడుతూ వైద్య రంగంలో సాంకేతికత వినియోగం వేగంగా పెరుగుతోందని, భవిష్యత్తులో ఏఐ కీలక పాత్ర పోషించనుందని అన్నారు.



వైద్యులు, టెక్నాలజీ నిపుణులు, ప్రభుత్వ సంస్థల మధ్య సమన్వయం ఉంటే ఆధునిక వైద్య సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించవచ్చన్నారు.డా. హరికుమార్ మాట్లాడుతూ ఏఐ వైద్యులను భర్తీ చేసే సాధనం కాదని, వారి నైపుణ్యాన్ని మరింత బలోపేతం చేసే శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. వైద్యులు సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకుని, రోగుల ప్రయోజనాలకు అనుగుణంగా కొత్త టెక్నాలజీలను వినియోగించుకోవాలని సూచించారు.సదస్సులో డా. కీర్తన యాదవ్, దుబాయ్‌కు చెందిన రెటీనా సర్జన్ డా. నిజాముద్దీన్, డా. సుభాన్, డా. నిధి, సుధా జైన్, సినీ నటి సనా తదితరులు పాల్గొన్నారు.

## నూతన బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

**ఆషాఢ బోనాల ఉత్సవాలకు ఎంపీ ఈటల రాజేందర్‌కు ఆహ్వానం**



**ముద్ర, కూకట్‌పల్లి:** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా (అర్బన్) భారతీయ జనతా పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన డి. గిరి వర్ధన్ రెడ్డి, రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావుతో కలిసి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు గిరి వర్ధన్ రెడ్డిని వడ్డేపల్లి రాజేశ్వరరావు శాలువాతో ఘనంగా సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేస్తూ, కార్యకర్తలతో సమన్వయం పాటిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.అలాగే, ఆషాఢ మాసం చివరి ఆదివారం సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లలో నిర్వహించే శ్రీ చిత్తారమ్మ తల్లి మరియు పోచమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలకు హాజరుకావాల్సిందిగా ఎంపీ ఈటల రాజేందర్‌కు, గిరి వర్ధన్ రెడ్డికి వడ్డేపల్లి రాజేశ్వరరావు ప్రత్యేకంగా ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్, బీజేపీ సీనియర్ నాయకులు ఐలయ్య యాదవ్, శ్రీనివాస్ గౌడ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**ముద్ర, కూకట్‌పల్లి:** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బిర్రు ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు.మగ్దుం నగర్ లోని శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్, నారాయణ మల్లారెడ్డి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా ఉండే జగద్గిరిగుట్ట లాంటి ప్రాంతాల్లో ఇటువంటి వైద్య శిబిరాలు ఎంతో ఆసరాగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుత వర్షాకాల వాతావరణంలో సీజనల్ వ్యాధులు ప్రబలే




అవకాశం ఉన్నందున ఈ శిబిరం స్థానికులకు ఎంతగానో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.అనంతరం వైద్య బృందం విద్యార్థులకు, స్థానిక ప్రజలకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు పద్మావతి నీలంశెట్టి, లయన్ జీత్, సుబ్రహ్మణ్యం, రమేష్ బాబు, నర్సిములు, భాషా, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పచ్చదనం పరిరక్షణకు సహకరించాలి

**30 వేల ట్రీ గార్డులు, రూ.60 లక్షల సి ఎస్ ఆర్ సహాయం అందించాలని ఈటల రాజేందర్‌కు విజ్ఞప్తి**

**ముద్ర, కాప్రా:** ఉప్పల్ నియోజకవర్గంలో పచ్చదనం పెంపునకు చేపడుతున్న విస్తృత హరిత కార్యక్రమాల్లో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించేందుకు 30,000 ట్రీ గార్డులు అవసరమని, ఇందుకు రూ.60 లక్షల CSR నిధులు అందించాలని కోరుతూ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్కు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వినతిపత్రం సమర్పించారు.నియోజకవర్గ పరిధిలో పెద్ద ఎత్తున మొక్కలు నాటుతున్నప్పటికీ వాటి సంరక్షణకు తగిన రక్షణ కల్పించడం ఎంతో అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మొక్కలకు ట్రీ గార్డులు ఏర్పాటు చేయడం ద్వారా వాటిని పశువుల నుంచి, ఇతర నష్టాల నుంచి కాపాడి పచ్చదనాన్ని స్థిరంగా పెంపొందించవచ్చని తెలిపారు.ఉప్పల్ జోన్ జోనల్ కమిషనర్ ఆధ్వర్యంలో ఇప్పటికే



ఈసీఐఎల్ సంస్థకు సి ఎస్ ఆర్ ద్వారా ట్రీ గార్డులు లేదా ఆర్థిక సహాయం అందించాలని ప్రతిపాదన సమర్పించినట్లు తెలిపారు. ఈ ప్రతిపాదనకు మద్దతుగా ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందించినట్లు ఎమ్మెల్యే వివరించారు.మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటే ఉప్పల్ నియోజకవర్గంలో పచ్చదనం మరింత విస్తరిస్తుందని, పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందుతుందని లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా నియోజకవర్గంలో హరిత కార్యక్రమాలను మరింత విస్తృతం చేసేందుకు తన కృషి కొనసాగుతుందని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్ నాయకుడు నాగారం బాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దుకాణంలో అగ్నిప్రమాదం

**రూ.2 లక్షల విలువైన సామగ్రి దగ్ధం**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** యాదగిరిగుట్ట పట్టణంలోని పాతగుట్ట సమీపంలో శనివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గుండ్లపల్లి నర్సింహకు చెందిన దుకాణంలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దుకాణం నుంచి పొగలు, మంటలు రావడాన్ని గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో మంటలు ఇతర దుకాణాలకు వ్యాపించకుండా అడ్డుకోగలిగారు. ప్రమాద సమయంలో దుకాణంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పినట్లు స్థానికులు తెలిపారు.ఈ ప్రమాదంలో దుకాణంలో ఉన్న వివిధ రకాల సామగ్రి మంటల్లో కాలిపోయిందని యజమాని గుండ్లపల్లి నర్సింహ తెలిపారు. సుమారు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు ఆయన పేర్కొన్నారు. అగ్నిప్రమాదానికి షార్ట్‌సర్క్యూటే కారణమై ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన అధికారులు, అగ్నిమాపక సిబ్బంది నష్టం వివరాలను అంచనా వేశారు. ప్రమాదంపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## దొరల గుండెల్లో సింహస్వప్నం పండుగ సాయన్న




**ముద్ర, కూకట్‌పల్లి:** దొరలు, పెత్తందార్ల ఆధిపత్యానికి గండికొట్టి, పేదల పక్షాన నిలిచిన తెలంగాణ రాబిన్ హుడ్ పండుగ సాయన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ శ్రీ బండి రమేష్ పిలుపునిచ్చారు.మూసాపేట్‌లో పండుగ రేణుక ఆధ్వర్యంలో నిర్వహించిన పండుగ సాయన్న జయంతి వేడుకలకు బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేదల హక్కుల కోసం, ఆకలి తీర్చడం కోసం పోరాడిన సాయన్న త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ బి అధ్యక్షులు తూము వేణుతో పాటు నాయకులు రజనీకాంత్, చిన్నారావ్, శేఖర్, రమణ, నర్సింగరావు, వాసు, అమీర్ తదితరులు పాల్గొని పండుగ సాయన్నకు నివాళులర్పించారు.

## హైకోర్టు స్టే ఆర్డర్‌ను తక్షణమే అమలు చేయాలి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** యాదాద్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం యాదగిరిగుట్ట కొండపైన దేవస్థానం ఏఈఓ శ్రవణ్‌కు వినతిపత్రం అందజేశారు. యాదగిరిగుట్ట కొండపై వర్తక సంఘం పేరుతో కొనసాగుతున్న దుకాణాలకు సంబంధించి రాష్ట్ర హైకోర్టు జారీ చేసిన స్టే ఆర్డర్ ను తక్షణమే అమలు చేయాలనీ వారు కోరారు.హైకోర్టు ఉత్తర్వులు అమల్లో ఉన్న నేపథ్యంలో వర్తక సంఘం పేరుతో కొనసాగుతున్న దుకాణాల్లో వ్యాపార కార్యకలాపాలను వెంటనే నిలిపివేసి, న్యాయస్థానం ఆదేశాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని దేవస్థానం అధికారులను కోరారు. న్యాయస్థానం ఉత్తర్వులను అమలు చేయడంలో ఎలాంటి జాప్యం చేయరాదని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బుగ్గ ఆంజనేయులు, కర్రె ప్రవీణ్, కాటబత్తిని ఆంజనేయులు, బండి అనిల్, పల్లపు బాలయ్య, దండబోయిన వీరేష్, మాటూరి బాలయ్య పాల్గొన్నారు.

## సీఆర్ ఫౌండేషన్‌లో ఉచిత వైద్య శిబిరం

**153 మందికి ఉచిత వైద్య సేవలు**

**ముద్ర, కొండాపూర్:** సీఆర్ ఫౌండేషన్‌లో సీఆర్ పాలీ క్లినిక్, రోటరీ ప్రొలిఫిక్స్ డయాగ్నస్టిక్ సెంటర్, ఐడిపిడీ తెలంగాణ, రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మావెరిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత బహుళ వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో సమీప, దూర ప్రాంతాల నుంచి వచ్చిన 153 మందికి ఉచిత వైద్య సేవలు అందించారు.పద్మశ్రీ ప్రొఫెసర్ డా. ప్రసాద్‌రావు, డా. కె. సత్యన్నారాయణ, డా. కె. రజని, డా. రాఘువేంద్రరావు, డా. అరుణ, డా. రహీల్, డా. భరత్‌కుమార్ తదితర వివిధ విభాగాల వైద్యులు పాల్గొని సేవలందించారు. కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్, దంత, ఫిజియోథెరపీ, హోమియోపతి తదితర వైద్య సేవలు అందించారు.

## ఎన్నికల్లో ఇచ్చినా హామీలను దశలవారీగా నెరవేరుస్తా



**ముద్ర ప్రతినిధి, తాండూర్:** మునిసిపల్ పరిధిలోని 7వ వార్డులో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి తాండూర్ పట్టణంలోనే అభివృద్ధి చెందిన వార్డుగా తీర్చిదిద్దడమే తన ఏకైక లక్ష్యమని 7వ వార్డ్ మున్సిపల్ కౌన్సిలర్ ఇర్షాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు ఏడవ వార్డులో నెలకొన్న సమస్యలనుదశలవారీగ పరిష్కరించిఅభివృద్ధి చెందిన వార్డుగా తీర్చిదిద్దుతానని అందులో భాగంగానే శనివారం రోజున సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. ప్రత్యర్థి పార్టీలు ఎన్ని అడ్డంకులు సృష్టించిన కాలనీలో అభివృద్ధి మాత్రం ఆగదని వార్డు ప్రజల ఆశీర్వాదం తనపై ఉన్నంతవరకు పెండింగ్లో ఉన్న ప్రతి పనిని పూర్తి చేయించే బాధ్యత తనదేనని ఆయన పేర్కొన్నారు.

## వైద్య చికిత్సలో నిర్లక్ష్యం.. వ్యక్తి మృతి?




**ముద్ర, కాప్రా:** ఈసీఐఎల్ చౌరస్తా సమీపంలో ఉన్న ఆక్సీకేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బొల్ల రవి (40) మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్ద నిరసన చేపట్టారు. వైద్యుల నిర్లక్ష్యం, చికిత్సలో జరిగిన లోపాలే మృతికి కారణమని వారు ఆరోపించారు.కుటుంబ సభ్యుల ఆరోపణల ప్రకారం.. రవి ఆరోగ్య పరిస్థితి విషమిస్తున్న విషయాన్ని ఆసుపత్రి యాజమాన్యం ముందుగానే గుర్తించినప్పటికీ తమకు పూర్తి సమాచారం ఇవ్వలేదని తెలిపారు. పరిస్థితి విషమించడంతో మరో ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ రవి మృతి చెందాడని చెప్పారు.చికిత్సలో ఏమైనా లోపాలు జరిగాయా? రోగి పరిస్థితిపై కుటుంబ సభ్యులకు పూర్తి సమాచారం ఇచ్చారా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని బాధిత కుటుంబం డిమాండ్ చేసింది. కేస్‌షీట్, వైద్య నివేదికలు, మందుల వివరాలు, రిఫరల్ రికార్డులను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని, తప్పు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కుషాయిగూడ పోలీసులకు విజ్ఞప్తి చేశారు

## మాణిక్ నగర్ లో పోలీసుల కార్డెన్ సెర్చ్

**68 వాహనాలు, 54 మద్యం బాటిల్, గుట్కా ప్యాకెట్లు స్వాధీనం**



**ముద్ర ప్రతినిధి, తాండూర్:** వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు తాండూర్ డిఎస్పి నర్సింగ్ యాదయ్య ఆధ్వర్యంలో తాండూర్ పట్టణంలోని మాణిక్ నగర్ లో పోలీసు బృందాలు కార్డెన్ సెర్చ్ నిర్వహించాయి. శనివారం రోజున ఉదయం నుండి పోలీసులు రంగంలోకి దిగి అనుమానాస్పదంగా కనిపించిన ప్రతి వాహనాన్ని తనకి చేసి సరైన పత్రాలు లభించని వాటిని అదుపులోకి తీసుకున్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్న, వ్యక్తులను, రౌడీ షీటర్ లను అనుమానితుల వివరాలను పోలీసులు పరిశీలించారు. తనకిల్లో సరైన పత్రాలు లేని వానాలను 65 ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలు ఉన్నట్లు డి.ఎస్.పి నర్సింగ్ యాదయ్య తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణ కొరకు, హింసకు తావు లేకుండా అసాంఘిక కార్యకలాపాలకు పాటుపడకుండా అనునిత్యం పోలీసుల నిఘా ఉంటుందని, ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఈ తనకిల్లో పట్టణ సిఐ పరమేశ్వర్ గౌడ్, రూరల్ సిఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమరుల యాదిలో చైతన్య యాత్ర

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని కల్లుగీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని. కల్లుగీత ఉద్యమంలో ఆశువులు బాసిన అమరులను స్మరిస్తూ సాగుతున్న అమరుల యాధిలో చైతన్య యాత్ర శనివారం యాదాద్రి భువనగిరి జిల్లాలోకి ప్రవేశించిన సందర్భంలో చౌటుప్పల్ మండలం ఎల్లగిరి వద్ద ఘన స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో కల్లు గీత కార్మిక సంఘం జిల్లా, మండల నాయకులున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 09.08.2026
www.mudranews.in | @mudranews



## చేతులు, కాళ్లు గుంజుతుంటే.. తరచూ గుంజుతుంటే నిర్లక్ష్యం చేయొద్దు

చేతులు, కాళ్లు తరచుగా గుంజడం లేదా తిమ్మిరి, బలహీనత, వాపు వంటి లక్షణాలతో కలిసి ఉంటే వైద్యులను సంప్రదించాలి. డీహైడ్రేషన్‌తో పాటు ఎలక్ట్రోలైట్ అసమతుల్యత, కొన్ని మందులు లేదా ఇతర ఆరోగ్య సమస్యలు కారణం కావచ్చు.



# కరీంనగర్ అభివృద్ధిపై భాజపా నాయకులు చర్చకు సిద్ధమా?

**- సుడా మాజీ ఛైర్మన్ నరేందర్ రెడ్డి**

**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ అభివృద్ధికి అత్యధిక నిధులు తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే, దీనికి సంబంధించిన మార్గదర్శకాలు కేంద్రమంత్రికి పంపిస్తామని కరీంనగర్ సుడా మాజీ ఛైర్మన్ నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో స్మార్ట్ సిటీలో భాగంగా కేంద్రం తీసుకొచ్చింది 25 పైసలు మాత్రమేనని, మిగతా 75 పైసలు రాష్ట్ర ప్రభుత్వమే ఇచ్చిందని తెలిపారు. భాజపా ప్రభుత్వం చర్చకు పిలిస్తే నేను సిద్ధమని పేర్కొన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, మాజీ మేయర్ సునీల్ రావు అవినీతికి పాల్పడి, వారే అవినీతి జరిగిందని అనడం విడ్డూరమన్నారు. కరీంనగర్ అభివృద్ధికి మొత్తం నిధులు కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకొచ్చిందని, కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. భాజపా నాయకులు చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు.



## ప్రభుత్వ పాఠశాలకు టీవీ బహుకరణ



**ముద్ర, కోరుట్ల :** రైల్వే వాకర్స్ అసోసియేషన్, ఇండోర్ స్టేడియం కోరుట్ల ఆధ్వర్యంలో వాకర్ రాచమడుగు శ్రీనివాస్ రావు జన్మదినం సందర్భంగా కోరుట్ల మండలం కల్లూరు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు టీవీని విరాళంగా అందజేశారు. విద్యార్థులకు విద్యాపరమైన కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలకు ఉపయోగపడేలా టీవీని పాఠశాల సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నరేశం, పాఠశాల సిబ్బంది, సర్పంచ్ లత-రమేష్, మాజీ సర్పంచ్ అంజయ్య, రైల్వే వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల నారాయణ గౌడ్, కోశాధికారి అన్నమనేని సతీష్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆషాఢ బోనాల పండగ




**ముద్ర చిగురుమామిడి :** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామంలొని ' విస్డం ఇంగ్లీష్ మీడియం హై స్కూల్' ఆవరణంలో ఆషాడ మాస బోనాల పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ శ్రీమతి కంది సంధ్య రు మాట్లాడుతూ ఆషాడ మాసంలో బోనాల పండుగ జరుపుకోవడం మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉండాలని, విద్యార్థులు నాణ్యమైన విద్యను నేర్చుకొని సమాజాభివృద్ధికి పాటుపడాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోర సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు సంస్కృతి సాంప్రదాయాలను కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆరు తడి పంటలతో అధిక లాభాలు

**- కలెక్టర్ భవేష్ మిశ్రా**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ జిల్లాలోని ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని శాస్త్రీయంగా, ప్రణాళికాబద్ధంగా వినియోగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. ఆరు తడి, ప్రత్యామ్నాయ పంటలతో అధిక లాభాలు పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. శనివారం పలు అంశాలపై నిర్వహించిన ఇరిగేషన్ అడ్వైజరీ సమావేశం అనంతరం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకు అవసరమైన మేరకు వర్షపాతం నమోదైనప్పటికీ కొన్ని మండలాల్లో సుమారు 20 శాతం వర్షపాతం లోటు ఉన్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో 'ఎల్ నినో' ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున ముందస్తు కార్యాచరణతో సాగునీటి నిర్వహణ చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని భవిష్యత్తు అవసరాలు, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వినియోగిస్తామని తెలిపారు. ఎస్సారెస్పీ ద్వారా జిల్లాలో సుమారు 35 వేల ఎకరాలకు, కడెం ప్రాజెక్టు ద్వారా 6 వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. గ్రామ సభల ద్వారా ప్రస్తుత పరిస్థితులను రైతులకు వివరించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇంకా స్వల్పకాలిక పంటలు సాగు చేసుకునేందుకు సమయం ఉన్నందున రైతులు కంది వంటి ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా వ్యవసాయ శాఖ అధికారులు ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. కంది సాగు రైతులకు లాభదాయకమని పేర్కొంటూ, ఈ ఏడాది జిల్లాలో కంది సాగు విస్తీర్ణాన్ని 6 వేల ఎకరాల నుంచి 10 వేల ఎకరాలకు పెంచినట్లు వెల్లడించారు. ఈ విలేకరుల సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, నీటిపారుదల శాఖ ఎస్ఈ రాజేంద్ర ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నో ఏండ్ల కల నెరవేరిన వేళ..

*** నవాబుపేట్ నుండి పొట్లపల్లి రహదారి కోసం రెండు కోట్ల ముప్పై లక్షలు మంజూరు చేసిన మంత్రి పొన్నం**
*** గ్రామోభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం అన్న సర్పంచ్**
*** మంత్రికి ధన్యవాదాలు తెలిపిన గ్రామాధ్యక్షుడు ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి,పాలక వర్గం**



**ముద్ర చిగురుమామిడి :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం లోకి వచ్చిన తర్వాత గ్రామాలను పల్లెలను శర వేగంగా అభివృద్ధి చేస్తుంది. అందులో భాగంగానే ఎన్నో ఏండ్లుగా రహదారికి నోచుకోక రాకపోకల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్న గ్రామస్తుల కోసం నవాబుపేట్ నుండి పొట్లపల్లి గ్రామానికి రహదారి నిర్మాణం కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ రెండు కోట్ల ముప్పై లక్షల రూపాయలు మంజూరు చేయడం పట్ల గ్రామ సర్పంచ్ శ్రీమతి గుళ్ళ రజిత రాజు, గ్రామధ్యక్షుడు ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి , పాలక వర్గం , ప్రజలు మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. పొట్ల పల్లి గ్రామానికి వెళ్ళాలంటే నల్లేరు మీద నడకల ఉండేది అని.. వర్షం కురిస్తే దారంతా బురదమయం అయ్యేదని మంత్రి గారి చొరవతో రహదారి నిర్మాణం జరగబోవటం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాత్రిళ్ళు వ్యవసాయ బావులదగ్గరికి వెళ్లాలంటే బురదగుంటల నుండి వెళ్లాల్సి వస్తుంది అని ఇక పైన తమకు ఆ కష్టాలు దూరం అవుతున్నాయని అన్నారు.

గ్రామాధ్యక్షుడు ఉపసర్పంచ్ ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యం అని ఎన్నికల సమయంలో మంత్రి గారికి ఈ రోడ్డు గూర్చి విన్నవించడం జరిగింది అని... ఇప్పుడు మంత్రి గారు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని.., అందుకుగాను గ్రామ ప్రజల తరుపున గ్రామ రైతుల తరపున మంత్రి గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం అన్నారు.అలాగే గ్రామంలో 90 శాతం సి సి రోడ్లు కూడా పూర్తి అయ్యాయని ,ప్రతి వీధికి వీధి దీపాలు కూడా వెలుగుతున్నాయని, గ్రామం అవతల ఉన్న వాగులోని త్రాగునీటి బావికి నీటి పైప్ లైన్ నిర్మించి గ్రామంలో నీటి సమస్య లేకుండా ఇంటింటికి నల్లా నీరు అందించడం కోసం సర్పంచ్ కృషి చేశారని, కచ్చితంగా నవాబుపేట్ గ్రామాన్ని మంత్రి గారి సహకారం తో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అందె సురేష్ , వార్డు మెంబర్ రాణప్రతప్ నాయకులు కూతురు రవీందర్ రెడ్డి. ,ఠాగూర్ దిలీప్, మ్యాకల రాజేందర్ , గుళ్ళ రాజు పాల్గొన్నారు

## మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన కోరుట్ల సిఐ లక్ష్మీనారాయణ

**తెలంగాణ శ్రీనివాసులు సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా వైద్య శిబిరం విజయవంతం....**



**ముద్ర, కోరుట్ల;** శ్రీనివాసులు పేరు కలిగిన వ్యక్తులు ఏ కార్యక్రమం చేసిన ఆ కలియుగ దైవం శ్రీనివాసుని దైవానుగ్రహం ఉంటుందని శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర శ్రీనివాసుల సేవా సంస్థ ఆధ్వర్యంలో తల సేమియా బాధితుల కోసం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం రాష్ట్ర అధ్యక్షులు ఊట్కూరి శ్రీనివాస్ రెడ్డి కోరుట్ల శ్రీనివాసుల సేవా సంస్థ బాధ్యులు శ్రీరాముల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కోరుట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ, సబ్ ఇన్స్పెక్టర్ శ్యామ్ రాజ్ లు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి ఇంత గొప్ప కార్యక్రమం ఏర్పాటు చేయడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ శ్రీనివాసుల పేరు పెట్టుకోవడమే కాదు మేము సేవలో కూడా ముందుంటామని నిరూపించినందుకు శ్రీనివాసులను అభినందించారు. తల సేమియా బాధితులకు అండగా నిలవడం గొప్ప విషయమని అన్నారు. ఇప్పటి వరకు 2650 మందికి రక్తదానం చేశామని ముమ్మందు కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. నేడు నిర్వహించిన రక్తదాన శిబిరానికి 25 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమం లో జగిత్యాల జిల్లా డిప్యూటీ డిఎంహెచ్ఓ శ్రీనివాస్, కోరుట్ల ప్రభుత్వ హాస్పిటల్ సూపరిండెంట్ సునీత, ప్రొఫెసర్ వైద్యులు ప్రవీణ్, జగిత్యాల బ్లడ్ బ్యాంక్ సిబ్బంది చిలువేరి ఉదయ ప్రసాద్, ఫార్మసీ ఆఫీసర్, ప్రమిత, కోరుట్ల శ్రీనివాసుల బాధ్యులు శ్రీరాముల శ్రీనివాస్, నీలి శ్రీనివాస్, గాంధారి శ్రీనివాస్ పాల్గొని రక్తదాన శిబిరంలో సేవలందించారు.

# వీడని కుల వివక్షత

**- అధికారుల నిమ్మకు నీరెత్తిన తీరుపై హెచ్చరిక!**
**- బీఎస్పీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్చార్జి బోయిని బాబు**




**ముద్ర చిగురుమామిడి :** చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామపం చాయతీలో మల్టీపర్పస్ వర్కర్ల విధుల కేటాయింపులో కుల వివక్ష జరుగుతోందని దళిత సంఘాలు, బీఎస్పీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్ చార్జి బోయిని బాబు ఆరోపించారు. సమాన గ్రేడ్, వేతనం పొందుతున్న సిబ్బందిలో దళిత వర్గానికి చెందిన ఉద్యోగులను పారిశుధ్య పనులకే పరిమితం చేస్తున్నారని ఆయన అన్నారు. ఇతర సామాజిక వర్గానికి చెందిన ఓ వర్కర్ కు బిల్ కలెక్టర్ బాధ్యతలు అప్పగించడంపై ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై అధికారులు వెంటనే విచారణ జరిపి, విధుల కేటాయింపులో పారదర్శకత పాటించాలని బోయిని బాబు డిమాండ్ చేశారు.

**లేని ఎడల ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం: బిఎస్పి హెచ్చరిక**

అధికారులు ఇకనైనా ఈ అంశంపై విచారణ జరిపి, మల్టిపుల్ ఉద్యోగులకు సమాన న్యాయం చేయాలని లేనియెడల సంబంధిత అధికారులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేస్తామని న్యాయపరంగా పోరాడుతామని ఈ సందర్భంగా బాబు హెచ్చరించారు.

# యూపీఐ లావాదేవీలు.. అవన్నీ ఉచితమే

**- కేంద్రం క్లారిటీ**

**ముద్ర, ఢిల్లీ :** యూపీఐ లావాదేవీల ఛార్జీలపై కేంద్ర ఆర్థికశాఖ కీలక ప్రకటన చేసింది. వినియోగదారులకు ఎలాంటి ఛార్జీలు ఉండవని వెల్లడించింది. వ్యక్తుల మధ్య జరిగే యూపీఐ లావాదేవీలన్నీ యథావిధిగా ఉచితంగానే కొనసాగుతాయని తెలిపింది. వ్యాపారులకు సంబంధించి అత్యధిక శాతం యూపీఐ లావాదేవీలు ఉచితంగానే కొనసాగుతాయని.. భవిష్యత్తులో ఎండీఆర్ (మర్చంట్ డిస్కౌంట్ రేట్) అమల్లోకి వచ్చినా అందరిపై ఏకపక్షంగా ఉండదని పేర్కొంది. మర్చంట్ లావాదేవీలపైనే నామమాత్రపు ఎండీఆర్ ఉంటుందని తెలిపింది. డెబిట్, క్రెడిట్ కార్డుల ఎండీఆర్ కంటే ఈ ఛార్జ్ తక్కువ ఉంటుందని తెలిపింది.

# పెట్టుబడిదారులకు ప్రభుత్వ సంస్థలను కట్టబెడుతున్న బీజేపీ ప్రభుత్వం

**- మోడీ విధానాలే ప్రజల కష్టాలకు కారణం.**
**- ప్రజలు మార్పు కోరుకోవాలి.**
**- సిపిఐ నేత,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి.**

**ముద్ర చిగురుమామిడి :** మూడు దఫాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పూర్తిగా ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ పెట్టుబడిదారులకు అప్పనంగా అప్పగిస్తుందని, ఈ విధానాలకు ప్రధాన కారణం ప్రధాని నరేంద్ర మోడీ కారణమని సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న సిపిఐ ప్రచార జాతా నేడు చిగురుమామిడి మండలంలోని బొమ్మనపల్లి, ఉల్లంపల్లి,కొండాపూర్ నవాబుపేట,సుందరగిరి గ్రామాల్లో పర్యటించింది. వివిధ గ్రామాల్లో జరిగిన కార్యక్రమాలకు మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి అధ్యక్షత వహించారు. జాతాకు ముఖ్య అతిథిగా విచ్చేసిన చాడ వెంక టరెడ్డి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విస్మరించి పెట్టుబడిదారులకు,కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తుందని,ఎన్నికలకు ముందు దేశ అభివృద్ధి,ఉపాధి అవకాశాలు, ప్రజా సంక్షేమం, సుపరిపాలన అందిస్తామని వాగ్దానం చేసినప్పటికీ ఇందులో ఏ ఒక్కటి కూడా అమలు పరచడం లేదని ఆరోపించారు.

నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్,డీజిల్, వంట గ్యాస్ ధరల బారాన్ని ప్రజలపై వేస్తుందని,దేశంలో ద్రవ్యోల్బణం కూడా ప్రజలపై మోయలేని భారంగా మారుతుందని,పెరుగుతున్న ధరలకనుగుణంగా ప్రజల ఆదాయం పెరగడం లేదని, రోజురోజుకు నిరుద్యోగం పెరిగిపోవడం మూలంగా యువత తీవ్ర నిరాశకు గురవుతున్నారని,వారి భవిష్యత్తు అనిచ్చితితో మిగిలిపోతుందనే భయాందోళనకు గురవుతున్నారన్నారు.

రైతులకు వ్యతిరేకంగా చట్టాలు తీసుకొస్తే దేశవ్యాప్తంగా రైతులు తీవ్ర ఆందోళన నిర్వహించారని,చివరకు కేంద్ర ప్రభుత్వం తలొగ్గిందని, ప్రధానమంత్రి హోదాలో నరేంద్ర మోడీ రైతులకు కనీస మద్దతు ధర చట్టం తెస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయకపోవడం దారుణమన్నారు. పండించిన పంటలకు కనీసం మద్దతు ధర చట్టబద్ధత కల్పించాలని, మహిళా రిజర్వేషన్ ను తక్షణమే అమలు చేయాలని, ధరల పెరుగుదలను నియంత్రించాలని,ప్రతి నిరుద్యోగ యువకుడికి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను హరించి వేస్తుందని, హక్కులను,చట్టాలను పరిరక్షించుకోవాలని, స్వయంగా సుప్రీంకోర్టు చెప్పిన విధంగా సమాన పనికి సమాన వేతనం కార్మికులకు అందించాలని డిమాండ్ చేశారు. దేశంలో సామాజిక న్యాయం కొరబడుతుందని, పేదలకు కూడు,గుడ్డ,నీడ కనీస మౌలిక వసతులు కూడా కల్పించలేదని,

దళిత, ఆదివాసీలపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని వాటిని నిలిపివేయాలని, డబ్బున్నవారే అధికారం చలాయిస్తున్నారని, ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా గెలుపొందుతున్నారని, డబ్బులేని పేదవారు కనీసం సర్పంచులుగా కూడా గెలవలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేకమంది పెట్టుబడిదారులు, కార్పొరేట్ అధిపతులు అధికారంలో కొనసాగుతున్నారని,



బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలను పునరుద్ధరించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలనీ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. జాతాలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, పొనగంటి కేదారి, మండల కార్యదర్శి నాగేల్లి లక్ష్మారెడ్డి, జాతా కోఆర్డినేటర్ లు గూడెం లక్ష్మి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, బోయిని అశోక్, జిల్లా కౌన్సిల్ సభ్యులు చాడ శ్రీధర్ రెడ్డి,అందె చిన్నస్వామి, తేరాల సత్యనారాయణ,ముద్రకోల రాజయ్య,మావురపు రాజు, మండల సహాయ కార్యదర్శి బూడిద సదాశివ,బీర్ల పద్మ, కొట్టె అంజలి,రంజిత్ వివిధ గ్రామాల శాఖ కార్యదర్శులు అందె సంపత్, ఎం.డి ఉస్మాన్ పాషా,రామస్వామి, శ్రీనివాస్,రాజు, అంజయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు స్పెషల్ మాన్సూన్ డ్రైవ్




ముద్ర, హైదరాబాద్ : హైదరాబాద్ లో దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల నివారణకు ఆగస్టు 11 నుంచి 21 వరకు స్పెషల్ మాన్సూన్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇందులో భాగంగా ఇంటింటికీ IEC అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

ప్రతి శుక్రవారం 'ఫ్రైడే–డ్రైడే' పాటిస్తూ ఇళ్లలో, పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని మంత్రి సూచించారు. దోమల లార్వా నివారణకు యాంటీ లార్వా ఆపరేషన్లు, ఫాగింగ్, కరపత్రాల పంపిణీ, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు స్వీయ బాధ్యతతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి డెంగ్యూ, చికున్ గున్యా వంటి వ్యాధుల నివారణలో భాగస్వాములు కావాలని కోరారు.

## చేతులు, కాళ్లు గుంజుతుంటే..



మెల్లగా స్ట్రెచ్ చేయండి. కండరాలు ఒక్కసారిగా పట్టేసినప్పుడు బలంగా లాగకుండా, నెమ్మదిగా స్ట్రెచ్ చేయాలి. స్వల్పంగా మసాజ్ చేయడం లేదా వెచ్చని కాపడం కూడా కొంత ఉపశమనం ఇవ్వొచ్చు.

## మీసేవ సెంటర్ల ఏర్పాటుకు అభ్యర్థులకు రాత పరీక్ష



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** యాదాద్రి భువనగిరి జిల్లాలోని అడ్డగూడూరు, ఆత్మకూరు, మోత్కూరు, చౌటుప్పల్, నారాయణపూర్ మండలాల్లో 8 నూతన మీసేవ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులకు శనివారం భువనగిరి పట్టణంలోని ఎస్ ఎల్ ఎన్ ఎస్ డిగ్రీ కళాశాలలో వ్రాత పరీక్ష నిర్వహించారు.మీసేవ సెంటర్ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో మొత్తం 209 మందికి హాల్ టికెట్లు జారీ చేయగా, 166 మంది అభ్యర్థులు వ్రాత పరీక్షకు హాజరయ్యారు. పరీక్షా ప్రక్రియను సంబంధిత అధికారులు పర్యవేక్షించారు.జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి టి. నాగిరెడ్డి పర్యవేక్షణలో వ్రాత పరీక్షను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, పారదర్శకంగా, సజావుగా నిర్వహించారు.అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పరీక్షా కేంద్రంలో అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. పరీక్షా ప్రక్రియ మొత్తం నిబంధనలకు అనుగుణంగా నిర్వహించారు.ఈ పరీక్ష నిర్వహణలో ఈ డి ఎం సాయి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ సైదా పాల్గొన్నారు.

## చిన్నారిపై కుక్కల దాడి

### చిన్నారికి తీవ్ర గాయాలు



**ముద్ర, దేవరకొండ:** వీధి కుక్కల దాడిలో ఓ చిన్నారి తీవ్ర గాయాల పాలైన సంఘటన శనివారం దేవరకొండ పట్టణంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం దేవరకొండ పట్టణంలోని 11వ వార్డులోని మగ్దుంబాబా నగర్ లో పానీపూరి వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్న అరుణ్– సోనాం దంపతుల మూడేళ్ల కుమార్తె నబియా వీధిలో ఆడుకుంటుండగా కుక్కలు ఒక్కసారిగా విచక్షణ రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. కుక్కల దాడిలో చిన్నారి దంతాలు సైతం ఊడి కిందపడ్డాయి. తీవ్ర గాయాల పాలైన చిన్నారిని కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు. దేవరకొండ పట్టణంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వీటిపై చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు వీధి కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకొని చిన్నారులను, ప్రజలను, కుక్కల దాడి నుండి కాపాడాలని పలువురు కోరుతున్నారు.

## ఇళ్ల మధ్య గేదెల పెంపకం వద్దు




**ముద్ర, దేవరకొండ:** నివాస ప్రాంతాల్లో ఇళ్ల మధ్య గేదెలను పెంచడం వల్ల దుర్వాసన, ఈగలు, దోమలు పెరిగి ప్రజారోగ్యానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని దేవరకొండ మున్సిపల్ కమిషనర్ రామ దుర్గా రెడ్డి తెలిపారు. గేదెల పేడ, వ్యర్థాలను రోడ్లు, డ్రైనేజీల్లో వేయరాదని, రోడ్లపై పశువులను వదలకూడదని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే మున్సిపల్ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజారోగ్యం, పట్టణ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

## ఎయిమ్స్ లో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

**ముద్ర, బీబీనగర్:** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ లోని అఖిల బారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) లో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అమిత్ అగర్వాల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తల్లిపాలను ప్రోత్సహించడానికి పోస్టర్, క్విజ్ పోటీలు, చనుబాలు పట్టే నిర్వహణ వర్క్‌షాప్‌లు, వ్యాస, కవితల పోటీలు, వీడియో పోటీలు, రేడియో కార్యక్రమాలు, సామాజిక కార్యక్రమాలు వంటివి ఇందులో భాగంగా నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన వారిని ఉద్దేశించి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అగర్వాల్ మాట్లాడుతూ బిడ్డలకు తల్లిపాల ఆవశ్యకతను తెలియపరిచారు. ఇందులో ప్రసూతి, గైనకాలజీ, నియోనాటాలజీ, పీడియాట్రిక్స్, కమ్యూనిటీ మెడిసిన్ అండ్ ఫ్యామిలీ మెడిసిన్ విభాగాలు, కాలేజీ ఆఫ్ నర్సింగ్, నర్సింగ్ ఆఫీసర్ల విభాగాలు సమన్వయంతో తల్లిపాల ప్రాముఖ్యతను వివరించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రసవానికి ముందు ఇచ్చే కౌన్సెలింగ్ నుంచి ప్రసవానంతర కాలం, ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత కూడా తల్లిపాలు పట్టడంలో ఆయా విభాగాల నుంచి నిరంతర మద్దతు అవసరమని అన్నారు.




## ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేలా పంటల సాగు చేపట్టాలి

> **సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**
> **ఆగస్టు 10 నుంచి 'రైతులతో మాట–పంట మార్పిడికి బాట' కార్యక్రమం**

**ముద్ర, సూర్యాపేట:** ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆశించిన స్థాయిలో కురిసే అవకాశాలు తగ్గుతున్న నేపథ్యంలో జిల్లాలోని రైతులు వరి సాగును తగ్గించి తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటల వైపు మళ్లాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. భూగర్భ జలాలు రోజురోజుకూ తగ్గుతున్నందున అందుబాటులో ఉన్న నీటిని తాగునీటికి ప్రాధాన్యతనిస్తూ వినియోగించాల్సిన పరిస్థితి ఉందన్నారు.తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, అదనపు కలెక్టర్ హరిసింగ్, నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ నాగభూషణరావు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డితో కలిసి శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.

**వరికి అధిక నీరు..**
**ఆరుతడి పంటలకు తక్కువ నీరు**

ఒక ఎకరం వరి సాగుకు సుమారు 44–55 లక్షల లీటర్ల నీరు అవసరం కాగా, పత్తికి 24–28 లక్షల లీటర్లు, కంది, పెసర, మినుము వంటి పంటలకు కేవలం 11–14 లక్షల లీటర్ల నీరు సరిపోతుందని కలెక్టర్ వివరించారు. జొన్న, సజ్జ, బొబ్బర్లు, అలసంద, మొక్కజొన్న, వేరుశనగ, రాగులు, కొర్రలు, అండుకొర్రలు, నువ్వులు వంటి పంటలకు కూడా తక్కువ నీరు అవసరమవుతుందని తెలిపారు.జిల్లాలోని నాగార్జునసాగర్, ఎస్సారెస్పీ స్టేజ్–2, మూసీ ప్రాజెక్టులతో పాటు 1,071 చెరువుల్లో నీటి లభ్యత తక్కువగా ఉందన్నారు. 54 ఐడీసీ లిఫ్టులు కూడా నడిచే పరిస్థితి లేదని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో వరి సాగు చేపట్టడం రైతులకు ఆర్థికంగా నష్టం కలిగించే అవకాశముందని, తక్కువ కాలంలో చేతికొచ్చే ఆరుతడి, చిరుధాన్యాల పంటలను సాగు చేయడం ద్వారా నష్టాన్ని తగ్గించుకోవచ్చని సూచించారు.1.30 లక్షల ఎకరాల్లోనే సాగుసూర్యాపేట జిల్లాలో వానాకాలంలో సాధారణంగా 5,80,729 ఎకరాల్లో 21 రకాల పంటలు సాగు చేయాల్సి ఉండగా, జూలై 18 నాటికి 1,30,504 ఎకరాల్లో మాత్రమే సాగు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సాధారణంగా 4,73,656 ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 46,361 ఎకరాల్లోనే సాగు జరిగిందన్నారు.పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 97,566 ఎకరాలు కాగా, జూలై 18 నాటికి 81,607 ఎకరాల్లో సాగు చేసినట్లు తెలిపారు. వర్షాలు ఇదే విధంగా కొనసాగితే తక్కువ నీటితో, తక్కువ కాలంలో పండే చిరుధాన్యాల సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

**విత్తనాలు, ఎరువులు సిద్ధం**

జిల్లాలో చిరుధాన్యాలు, కూరగాయలతో కలిపి సుమారు 1,45,203 ఎకరాల్లో సాగు చేయాలని అంచనా వేయగా, ఇందుకు 29,254.07 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని తెలిపారు. ప్రస్తుతం 33,486 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, ప్రైవేట్ డీలర్లు, రైతులు, ప్రభుత్వ పంపిణీ కేంద్రాల వద్ద విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ వివరించారు.2026 సంవత్సరానికి యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, ఎస్ఎస్‌పీ, ఎంఓపీ తదితర ఎరువులు 1,28,183 మెట్రిక్ టన్నులు అవసరమని అంచనా వేయగా, ఇప్పటివరకు 44,357 మెట్రిక్ టన్నులు విక్రయించినట్లు తెలిపారు. మరో 26,763 మెట్రిక్ టన్నుల ఎరువులు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు.ఆగస్టు 10 నుంచి ప్రత్యేక అవగాహన కార్యక్రమంఆరుతడి పంటల సాగును ప్రోత్సహించేందుకు ఆగస్టు 10 నుంచి పది రోజులపాటు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. 'రైతులతో మాట—పంట మార్పిడికి బాట', 'ఆరుతడి—మేలైన వ్యవసాయ సాగుబడి' వంటి నినాదాలతో రైతులకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ప్రతి అధికారి కనీసం పది మంది రైతులను కలిసి ఆరుతడి పంటల ప్రయోజనాలను వివరించి, పంట మార్పిడిపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. ప్రకృతిలో చోటుచేసుకుంటున్న మార్పులు, నీటి కొరత పరిస్థితులను రైతులు అర్థం చేసుకుని ప్రభుత్వానికి సహకరించాలనీ కోరారు. నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా సాగు వ్యయాన్ని తగ్గించుకుని, రైతులు మెరుగైన లాభాలు పొందాలని ఆకాంక్షించారు. వ్యవసాయం 'దండగ కాదు.. పండగ'గా మారేలా పంట మార్పిడిని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

## ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టిన వేడుకలు

### సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించిన ఆదివాసీ దినోత్సవ వేడుకలు

**ముద్ర, దేవరకొండ:** ఆదివాసీ సమాజ అభ్యున్నతికి విద్యే ప్రధాన ఆయుధమని పేర్కొంటూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని తెలంగాణ గిరిజన మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం హరిప్రియ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ , గిరిజన సంక్షేమ సెక్రెటరీ కే సీత లక్ష్మి , డి ఎస్ వేణుగోపాల్ , ఓ ఎస్ డి లు జి బి వెంకటేశం, రామారావు, సతీష్ గౌడ్, నీరజాసిన్హా, నల్గొండ రీజినల్ కోఆర్డినేటర్ శ్రీనివాసరాయ్, మైనంపల్లి సర్పంచ్ రామ్ సింగ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రమావత్ రవి , రాష్ట్రవ్యాప్త గిరిజన కళాశాలల ప్రిన్సిపల్స్, అధ్యాపక బృందం





విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల నృత్య , గిరిజన పాత్ర కళా పోషణ షోకేస్, 11 రకాల గిరిజన పండుగల దేవాలయాలు మరియు గిరిజనులకు సంబంధించిన నాలుగు రకాల స్టాల్స్ అవి గదా, కళా, స్వాద్, ఔషధ ప్రదర్శించచారు. ప్రదర్శనలో ప్రతి ఒక్క విద్యార్థి గిరిజనులకు సంబంధించిన హిస్టరీ, సాంస్కృతి సంప్రదాయాలు, ఆహార అలవాట్లు మరియు ఔషధ మొక్కలు సేకరించి వాటిని క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో తిరుమల రావు తెలుగు యూనివర్సిటీ ప్రొఫెసర్, ఏ పి ఓ భాస్కర్ రావు అదిలాబాద్ సహాయ సహకారాలు అందించారు. ఈ కార్యక్రమం ఆహ్లాదకరముగా ప్రదర్శించారని మహిళ గిరిజన డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం హరిప్రియ, అధ్యాపక బృందం, విద్యార్థినీలు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## జైల్ భరోను జయప్రదం చేయండి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి** :బిజెపి ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు, కార్పొరేట్ అనుకూల విధానాలను ఎండగాడుతూ జరిగే జైల్ భరోను జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని సుందరయ్య భవనంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సమావేశం గంధమల్ల మాతయ్య అధ్యక్షతన జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 10న క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ప్రజా సంఘాలు నిర్వహిస్తున్న జైలు భరో కార్యక్రమానికి సిపిఎం పట్టణ కమిటీ సంపూర్ణంగా మద్దతు ప్రకటిస్తున్నామనిన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూల, కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను మరింత వేగంగా అమలు చేస్తుందని అన్నారు. ఎందరో పోరాట యోధుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న దేశ స్వాతంత్ర్యాన్ని విదేశీ సంస్థలకు తాకట్టు




పెడుతున్నారన్నారు. కార్మికుల రోజు పని దినాలు 8 గంటల నుండి 12 గంటల వరకు పెంచేందుకు యాజమాన్యాల పూర్తిగా స్వేచ్ఛనిచ్చారని అన్నారు. సమ్మె హక్కు ను కాలరాస్తూ ఆంక్షలు విధిస్తూ కార్మిక సంఘాల గుర్తింపు రిజిస్ట్రేషన్ ను కష్టతరం చేశారని అన్నారు. బిజెపి ప్రభుత్వం ఉత్పత్తి ధరను తగ్గించి నిర్ణయించడం వల్ల గిట్టుబాటు ధర రావడంలేదని కనీస మద్దతు ధరల చట్టాన్ని పార్లమెంట్లో ఆమోదించాలని ఆందోళన చేస్తున్నప్పటికీ కేంద్రం నిమ్మకు నీరెత్తినట్లు ఉందని అన్నారు. వామపక్షాల పోరాట ఫలితంగా 2005లో మాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారెంటీ చట్టం రూపొందిందని అన్నారు. మహాత్మా గాంధీ పేరు తొలగించి వికసిత్ భారత్ గ్రామ్ జి పేరుగా మార్పు చేయడమే కాక రాష్ట్రాల వాటా 10 శాతం నుండి 40 శాతం నిధులను భరించాలని నిర్ణయించిందని అన్నారు. స్వేచ్ఛ, స్వాతంత్రం కోసం సాగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్పొరేట్ పెట్టుబడిదారులకు, మతోన్మాదులకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు,ప్రజాతంత్ర వాదులు ఐక్యంగా పోరాడాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వనం రాజు, కల్లూరి నాగమణి పాల్గొన్నారు.

## సమగ్ర సాగునీటి ప్రణాళికను ప్రకటించాలి

### మాజీ మంత్రి పువ్వాడ

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో సాగునీటి లభ్యత, వినియోగం, నీటి విడుదలపై రైతులకు ప్రభుత్వం స్పష్టమైన అవగాహన కల్పించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఎల్‌నినో నేపథ్యంలో పంటల సాగుకు అవసరమైన నీటి లభ్యతపై స్పష్టత ఇవ్వడంతో పాటు, రైతులు ముందస్తుగా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకునేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలని మాజీ మంత్రి పువ్వాడ పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, వర్షపాతంలో హెచ్చుతగ్గుల నేపథ్యంలో అందుబాటులో ఉన్న సాగునీటి వనరులను శాస్త్రీయంగా, ప్రణాళికాబద్ధంగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. సాగర్, గోదావరి, మున్నేరు, వైరా, పాలేరు, కిన్నెరసాని తదితర జల వనరుల్లో నీటి లభ్యతను ఎప్పటికప్పుడు అంచనా వేసి, ఆయకట్టు రైతులకు ముందస్తుగా సమాచారం అందించాలని కోరారు.ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువుల్లో ప్రస్తుతం ఎంత మేరకు నీటి నిల్వలు ఉన్నాయి, ఎప్పుడు నీటిని విడుదల చేస్తారు, ఏ ప్రాంతాలకు ఎంత మేరకు నీరు అందుబాటులో ఉంటుంది అనే వివరాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షించి అధికారికంగా ప్రకటించాలని అన్నారు. నీటి విడుదలకు సంబంధించి ముందస్తు షెడ్యూల్‌ను ప్రకటిస్తే రైతులు పంటల ఎంపిక, సాగు సమయం, నీటి వినియోగంపై సరైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు.రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సాగునీటి నిర్వహణ, నీటి లభ్యతపై ఎలాంటి అనిశ్చితి లేకుండా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడితే రైతులు నష్టపోకుండా పంటల సాగును ప్రణాళికాబద్ధంగా కొనసాగించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

## బీజేపీ తెలంగాణ ఓబీసీ మోర్చా పాలసీ రీసెర్చ్ రాష్ట్ర కన్వీనర్‌గా సుర్వి శ్రీనివాస్ గౌడ్



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** బీజేపీ తెలంగాణ ఓబీసీ పాలసీ రీసెర్చ్ రాష్ట్ర కన్వీనర్‌గా సుర్వి శ్రీనివాస్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అగ్రనాయకత్వం ఆయనకు బాధ్యతలను అప్పగించింది. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు సుర్వి శ్రీనివాస్ గౌడ్ పార్టీ నాయకత్వానికి తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, వెనుకబడిన వర్గాల (ఓబీసీ) సంక్షేమం, హక్కుల సాధనకై రూపొందించే విధానాలలో తన వంతు పూర్తి సహకారాన్ని అందిస్తానని స్పష్టం చేశారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ పార్లమెంట్ సభ్యులు బూర నర్సయ్య గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. కసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, జిల్లా అధ్యక్షులు ఊట్కూరి అశోక్ గౌడ్, మాజీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్ మోహన్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

## డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ జన్మదిన వేడుకలు శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ర్యాకల శ్రీనివాస్‌తో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ వేడుకల్లో భాగంగా పార్టీ కార్యాలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మండల అధ్యక్షులు జనగాం పాండు, పట్టణ అధ్యక్షులు ఎవి కిరణ్, నీల ఓం ప్రకాష్ గౌడ్, చందుపట్ల మాజీ పి ఏ సి ఎస్ బ్యాంక్ చైర్మన్ బల్గూరి మధుసూదన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఏనబోయిన ఆంజనేయులు, మాజీ జడ్పీటీసీ బీరు మల్లయ్య, మాజీ జడ్పీటీసీ సందెల సుధాకర్, మాజీ ఎంపీపీ కేశవపట్నం రమేష్, సర్పంచ్ జక్క రాఘవేందర్ రెడ్డి, కస్తూరి పాండు, బాతుక అశోక్, కుతాడి సురేష్, మూలే నాగేంద్రబాబు, కంకల మహేష్, లింగస్వామి, కార్యకర్తలు, నాయకులు, ఆయన అభిమానులు పాల్గొన్నారు.శ్రీ పూర్ణగిరి సుదర్శన లక్ష్మి నరసింహస్వామి దేవాలయంలో...మండలంలోని నమాత్‌పల్లి గ్రామంలోని స్వయంభూ శ్రీ పూర్ణగిరి సుదర్శన లక్ష్మి నరసింహస్వామి దేవాలయంలో ఆర్ ఎస్ కే ఫౌండేషన్ అధినేత, సామాజికవేత్త, బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆర్ ఎస్ కే టీం ఆధ్వర్యంలో దేవాలయానికి విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ రావి సురేందర్ రెడ్డి స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గుమ్మి నవీన్ రెడ్డి, జోగు సతీష్, పండుగ కిరణ్, మహమ్మద్ యాకుబ్, ఎస్.కె హైమత్, ఉడుత రాజు, ఉడుత శేఖర్, బీట్కూరి లక్ష్మణ్ పాల్గొన్నారు.

## తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మీడియా పబ్లిసిటీ విభాగం చైర్మన్‌కు శుభాకాంక్షలు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మీడియా పబ్లిసిటీ డిపార్ట్మెంట్ చైర్మన్‌గా నియమితులైన భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డిని మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు హీరేకార్ శ్రీను, ఎం.డి. కరీం శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన బాధ్యతల్లో విజయవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. పార్టీ బలోపేతానికి మీడియా విభాగం కీలక పాత్ర పోషించాలని వారు పేర్కొన్నారు.

## రాష్ట్రస్థాయి టైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** తెలంగాణ స్టేట్ టైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 8 నుంచి 10 వరకు కరీంనగర్ జిల్లా చొప్పదండిలోని జి ఆర్ ఆర్ ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి టైక్వాండో పోటీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా క్రీడాకారులు పాల్గొన్నారు.ఈ పోటీల్లో 40వ తెలంగాణ స్టేట్ సబ్–జూనియర్ కయోరూజీ , 14వ సబ్–జూనియర్ పూమ్సే, 43వ జూనియర్ కయోరూజీ, 16వ జూనియర్ పూమ్సే విభాగాల్లో జిల్లా క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు.జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదలతో పోటీలకు సిద్ధమై రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి యాదాద్రి భువనగిరి జిల్లాకు పేరు తీసుకురావాలని జిల్లా టైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు ఆకాంక్షించారు.జిల్లా టైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు సైదులు, కార్యదర్శి మాస్టర్ కె. శ్రీకాంత్ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 09.08.2026
www.mudranews.in | @mudranews



**చేతులు, కాళ్లు గుంజుతుంటే..**



నీళ్లు ఎక్కువగా తాగండి. శరీరంలో నీరు తగ్గడం వల్ల కండరాలు పట్టేయడం, చేతులు కాళ్లు గుంజడం జరగొచ్చు. రోజంతా తగినంత నీరు తాగడం, ముఖ్యంగా వ్యాయామం తర్వాత ద్రవాలు తీసుకోవడం ఉపయోగపడుతుంది.

# ఎన్‌హెచ్–44పై నిఘా మరింత పటిష్టం

**అతివేగం, ప్రమాదాలు, ట్రాఫిక్ ఉల్లంఘనలపై ఎప్పటికప్పుడు నిఘా**
**ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి**





**ముద్ర ప్రతినిధి, మెదక్:** జాతీయ రహదారి–44పై నిఘాను మరింత పటిష్టం చేయాలని మల్టీ జోన్–I ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం తూప్రాన్ టోల్‌గేట్ వద్ద ఉన్న కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాల నిఘా, అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పనితీరును పరిశీలించారు. ఎన్‌హెచ్–44పై వాహనాల రాకపోకలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అతివేగం, రాంగ్ లేన్‌లో ప్రయాణించడం, వ్యతిరేక దిశలో వాహనాల రాకపోకలు, హెల్మెట్, సీట్‌బెల్ట్ ఉల్లంఘనలు, ట్రిపుల్ రైడింగ్ తదితర ట్రాఫిక్ ఉల్లంఘనలను సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి, సంబంధిత పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాఫిక్ మానిటరింగ్ కెమెరాలు, వాహన వేగాన్ని గుర్తించే వీవీఎస్, రాడార్ ఆధారిత హెచ్చరిక వ్యవస్థలు, వేరియబుల్ మెసేజింగ్ సైన్ బోర్డులు తదితర వ్యవస్థలను ఐజీ పరిశీలించారు. ప్రమాదాలు, రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు, అడ్డంకులు, పాదచారుల రాకపోకలు వంటి ఘటనలను ఎప్పటికప్పుడు గుర్తించి తక్షణ చర్యలు చేపట్టేలా వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. అతివేగంగా ప్రయాణించే వాహనాలను గుర్తించి ఈ–చలాన్ ద్వారా చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలు లేదా అత్యవసర పరిస్థితులు గుర్తించిన వెంటనే పోలీస్, అంబులెన్స్, సిబ్బందికి సమాచారం అందేలా సమన్వయం చేసుకోవాలని తెలిపారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా 24 గంటలూ నిఘా కొనసాగించాలన్నారు. వెంట ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, ఎస్ఐ గంగారాజు, ఉన్నారు. మనోహరాబాద్ స్టేషన్ తనిఖీమనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌నుఐజీ చంద్రశేఖర్ రెడ్డి తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసులు, సిబ్బంది పనితీరు, సాంకేతిక వనరుల వినియోగాన్ని పరిశీలించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించాలని సూచించారు.

**ఖో ఖో పోటీలు ప్రారంభించిన ఐజీ**

విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని ఐజీ చంద్రశేఖర్ రెడ్డిసూచించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ పాల్గొనడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలు, టీమ్ స్పిరిట్ పెంపొందుతాయని అన్నారు. తూప్రాన్ పట్టణంలోని ఒలంపియా స్కూల్‌లో నిర్వహిస్తున్న సీబీఎస్ఈ ఖో–ఖో ఛాంపియన్‌షిప్–2026 పోటీలను ప్రారంభించారు. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తాను పాఠశాల స్థాయిలో ఖో–ఖో, కబడ్డీ ఆడేవాడినని, ప్రస్తుతం టెన్నిస్ ఆడుతున్నానని తెలిపారు. విద్యార్థులు తమకు ఇష్టమైన క్రీడలో నైపుణ్యాన్ని పెంపొందించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పోటీలను క్రీడాస్ఫూర్తితో, స్నేహపూర్వక వాతావరణంలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు,అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐలు వెంకట రాజా గౌడ్, సందీప్ రెడ్డి, తూప్రాన్ ఎస్ఐ గంగరాజు, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఉమ్మడి ఖమ్మం కాంగ్రెస్‌లో 'నామినేటెడ్' పోరు

**-ముగ్గురు మంత్రుల ఆధిపత్యంలో ఎవరిది పైచేయి?**




**ముద్ర ప్రతినిధి,ఖమ్మం 8 :** కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని కంచుకోటగా ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇప్పుడు 'నామినేటెడ్ పదవుల పంపకం' రగడ రేపుతోంది. రాష్ట్రంలో కీలక పాత్ర పోషిస్తున్న ముగ్గురు మంత్రులు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుల మధ్య నిశ్శబ్ద పోరు ఇప్పుడు బహిరంగ ఆధిపత్య పోరాటంగా మారింది. మరో పక్క ఎంపి రేణుకా చౌదరి తనవర్గానికి సరైన ప్రాధాన్యత దక్కడం లేదని ఆగ్రహంగా ఉన్నారు. జిల్లాలో పార్టీ బలం అనూహ్యంగా పెరిగినప్పటికీ, అదే స్థాయిలో నాయకుల మధ్య అంతర్గత పోటీ పెరగడం అధిష్టానానికి పెద్ద తలనొప్పిగా మారింది.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన తొలి విడత కార్పొరేషన్ చైర్మన్ల నియామకాల్లో భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గాలకే సింహభాగం పదవులు దక్కాయి. జిల్లా రాజకీయాల్లో దశాబ్దాలుగా తమదైన ముద్ర వేసిన ఈ ఇద్దరు నేతలు, అధిష్టానం వద్ద తమ మార్కును చూపిస్తూ తమ అనుచరులకు కార్పొరేషన్ చైర్మన్ పదవులను దక్కించుకోవడంలో విజయవంతమయ్యారు. భట్టి తన పట్టును నిలుపుకోగా, కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి దూకుడుగా వ్యవహరిస్తున్న పొంగులేటి కూడా తన వర్గానికి ప్రాధాన్యం వచ్చేలా చూసుకున్నారు. తుమ్మల నాగేశ్వరరావు జోక్యం చేసుకోకపోవడమే ఆయన వర్గానికి మొదటి దఫాలో చేటు దక్కలేదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఎంపి రేణుకా చౌదరి తన అనుచరులకు పదవులు ఇప్పించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాల్లో సీనియర్ నాయకులైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రేణుకా చౌదరి వర్గాలకు తొలి విడతలో ఒక్క కార్పొరేషన్ చైర్మన్ పదవి కూడా దక్కకపోవడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అసెంబ్లీ ఎన్నికల్లో తుమ్మల కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుని ఖమ్మం స్థానం నుంచి విజయం సాధించడమే కాకుండా, జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో పార్టీ విజయానికి కీలక పాత్ర పోషించారు. అయితే, తొలి విడత నామినేటెడ్ పదవుల ఎంపికలో ఆయన స్వయంగా చొరవ తీసుకోకపోవడం, అధిష్టానానికి తన వర్గం పేర్లను గట్టిగా ప్రతిపాదించకపోవడమే ఈ పరిస్థితికి కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.దీంతో ఎన్నికల సమయంలో అహర్నిశలు కష్టపడి పార్టీ విజయం కోసం పనిచేసిన తమకు గుర్తింపు దక్కలేదని తుమ్మల అనుచరులు తీవ్ర నిరాశ, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తొలి విడతలో జరిగిన పరాభవాన్ని అధిగమించి, తనను నమ్ముకున్న అనుచరులకు న్యాయం చేసేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీరియస్‌గా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. రెండో విడత నామినేటెడ్ నియామకాల్లో తన వర్గానికి చెందిన కీలక నాయకుల పేర్లను స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ అధిష్టానానికి సూచించేందుకు ఆయన ప్రణాళిక సిద్ధం చేశారని తెలుస్తోంది. రేణుకా చౌదరి కూడా ఈసారి తన అనుచరులకు పదవులు ఇప్పించుకునేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.దశాబ్దాలుగా తమ వెంటే నడిచిన నాయకులకు పదవులు దక్కకపోతే జిల్లా రాజకీయాల్లో తన పట్టు సడలే ప్రమాదం ఉందన్న భావనతో నేతలు ఈసారి తగ్గేదే లేదనే సంకేతాలు ఇస్తున్నారనే చర్చ జరుగుతోంది.

**పదవులే కాదు, సీనియారిటీ, ఆధిపత్య పోరుకు గీటురాయి!**

కార్పొరేషన్ చైర్మన్ పదవుల వ్యవహారం కేవలం నామినేటెడ్ పోస్టుల భర్తీకే పరిమితం కాకుండా, జిల్లాలో ముగ్గురు మంత్రులు, ఎంపీ రేణుకా రాజకీయ బలాబలాలను కొలిచే గీటురాయిగా మారింది.

సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ నమ్ముకున్న కేడర్‌పై తన ఆధిపత్యాన్ని నిలుపుకునే ప్రయత్నం చేస్తున్నారు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క

మరో పక్క రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితనతో పాటు పార్టీలో చేరిన నాయకులకు పదవులు దక్కించి తన బలాన్ని మరోసారి నిరూపించలనుకుంటున్నారు. మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన వ్యక్తిగత క్యాడర్‌కు న్యాయం చేసి, జిల్లా రాజకీయాల్లో సీనియర్ నేతగా తన ప్రాభవాన్ని నిలబెట్టుకోవాలని చూస్తున్నారు. రేణుకా చౌదరి కూడా గట్టిగానే పట్టుబడుతున్నారు.

**అధిష్టానానికి తలనొప్పిగా ఖమ్మం పంచాయితీ**

జిల్లాలో కాంగ్రెస్ ఎంత బలంగా ఉందో, నాయకుల మధ్య విభేదాలు కూడా అంతే స్థాయిలో ఉండటం పార్టీ అధిష్టానానికి సవాలుగా మారింది. ఏ ఒక్క వర్గానికి ఎక్కువ ప్రాధాన్యమిచ్చినా మిగతా వర్గాల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమయ్యే ప్రమాదం ఉంది. రాబోయే రెండో విడత నియామకాలైనా ముగ్గురు మంత్రులకు, రేణుకా చౌదరి కి న్యాయం చేసి అధిష్టానం సమతుల్యత పాటిస్తుందా? లేక మరోసారి భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గాలే పైచేయి సాధించి తమ పట్టును చాటుకుంటాయా? అనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

# అమ్మాయిలూ.. 'రెంట్ బాయ్‌ఫ్రెండ్' ఆఫర్ల వలలో పడకండి

**డిస్కౌంట్ల పేరుతో సైబర్ మోసం : సీపీ సజ్జనార్**



**ముద్ర, హైదరాబాద్ :** ఒంటరితనంతో బోర్ కొడుతోందా.. షాపింగ్‌కి కవర్లు మోసేందుకు లేదా మీ డిజైనర్ డ్రెస్‌కి కాంప్లిమెంట్స్ ఇచ్చేందుకు ఓ అందమైన కుర్రాడు కావాలా? అదిగో సోషల్ మీడియాలో ఆగస్టు 1 స్పెషల్ ఆఫర్ నడుస్తోంది. రెంట్ బాయ్‌ఫ్రెండ్‌పై ఏకంగా 50% డిస్కౌంట్ ఇస్తున్నారంట.. నిజంగా ఎంత వినసొంపైన ఆఫర్ కదూ.. స్విగ్గీ, జొమాటోల్లో ఫుడ్ ఆర్డర్ చేసినట్టు ఇన్‌స్టాగ్రామ్‌లో స్క్రోల్ చేస్తూ 'బాయ్‌ఫ్రెండ్'ని కూడా గంటల చొప్పున ఆర్డర్ ఇచ్చేయొచ్చన్నమాట. కాఫీ మీటింగ్, మూవీ డేట్, షాపింగ్ కంపెనీ అని రకరకాల ప్యాకేజీలు ప్రకటిస్తూ దానికి తగ్గట్టు రకరకాల కుర్రాళ్ల ఫోటోలను డిజైన్ చేసి సైబర్ నేరగాళ్లు పోస్టులు పెడుతున్నారు. ఆ పోస్టర్లలో వాళ్లు చూపిస్తున్న క్రియేటివిటీ చూస్తే ఎవరికైనా హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే.

అయితే ఆగండి మేడమ్స్ ఈ వర్చువల్ ఫాంటసీకి కాస్త బ్రేకులు వేయండి. అక్కడ కనిపిస్తున్నవన్నీ 'రీల్' ఫోటోలే తప్ప 'రియల్' క్యారెక్టర్లు కావు. ఈ డిస్కౌంట్ల వెనుక ఎంత పెద్ద డ్రామా ఉందో తెలిస్తే మీ ఫ్యూజ్ అవుట్ అవ్వడం ఖాయం. మోజు పడి ఏ ఇన్‌స్టాగ్రామ్‌లోని 'రెంట్ బాయ్‌ఫ్రెండ్' అకౌంట్‌కో డీఎమ్ చేశారంటే అసలు కథ మొదలవుతుంది. మొదట రామ్ చరణ్, మహేష్ బాబుల మిక్సింగ్‌లా ఉండే ఫేక్ ఫోటోలు చూపిస్తూ చాలా స్వీట్‌గా మాట్లాడతారు. ఆ తర్వాత కుర్రాడు బైక్ వేసుకుని బయలుదేరాడని ముందుగా బుకింగ్ కన్ఫర్మేషన్ ఫీజు, సెక్యూరిటీ డిపాజిట్, అడ్వాన్స్ పేమెంట్ పేర్లతో క్యూఆర్ కోడ్లు పంపుతారు. మీరు అమాయకంగా ఆ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి, డబ్బులు పంపేశాక బాయ్‌ఫ్రెండ్ ఎక్కడ అని అడిగేలోపే మీ ప్రొఫైల్ బ్లాక్ అయిపోతుంది.

డబ్బులు పోతే పోయాయిలే అని సరిపెట్టుకుందామన్నా ఈ కేటుగాళ్లు అంతటితో వదలేరండోయ్. చాటింగ్ స్పీడ్‌లో మీరు షేర్ చేసిన ఫోన్ నెంబర్లు, పర్సనల్ ఫోటోలు పట్టుకుని బ్లాక్‌మెయిలింగ్ స్టార్ట్ చేస్తారు. అలాగే అపరిచిత వ్యక్తులను నేరుగా కలవడం వల్ల భౌతిక భద్రతకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. దీనిపై హైదరాబాద్ సీపీ సజ్జనార్ స్పందిస్తూ సోషల్ మీడియాలో కనిపించే ప్రతి ఆకర్షణీయమైన ఆఫర్‌ను గుడ్డిగా నమ్మవద్దని హెచ్చరిస్తున్నారు. అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని, రూపాయి కూడా ముందస్తుగా చెల్లించవద్దని సూచించారు. ఒకవేళ ఇలాంటి అనుమానాస్పద పోస్టులు కనిపిస్తే లేదా మోసపోతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. కాబట్టి అమ్మాయిలూ ఒంటరితనం పోగొట్టుకోవడానికి సరదాగా సినిమాలు చూడండి తప్ప ఇలాంటి 'రెంట్ బాయ్‌ఫ్రెండ్' డిస్కౌంట్లకు కక్కుర్తి పడి జేబులు ఖాళీ చేసుకోకండి..

## కాళికామాత పల్లకిసేవ



**ముద్ర ప్రతినిధి, మెదక్:** పట్టణంలో స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో కాళీకాదేవి పల్లకి సేవ శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శివ రామాచారి ప్రత్యేక పూజలు అనంతరం పల్లకి సేవ వీధులలో ముందుకు సాగగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షులు పూనా రవి చారి, పట్టణ అధ్యక్షులు ఏలేశ్వర బ్రహ్మచారి, ప్రధాన కార్యదర్శి ఇటిక్యాల వేణు చారి, కోశాధికారి సరాపు కాశానాథం చారి, ఆలయ కమిటీ అధ్యక్షులు జగ్గనగరి బ్రహ్మచారి, కార్యదర్శి చిన్నోజు మహేష్ చారి, కోశాధికారి నల్లనగుల రాజు చారి,యువజన అధ్యక్షులు ముత్తోజు రవీందర్ చారి, ప్రధాన కార్యదర్శి చిన్నోజు నరేష్ చారి, కోశాధికారి మైలవరం నవీన్ చారి,జేఎల్ శ్రీనివాస్ చారి, రాచపల్లి శ్రీనివాస్ చారి, సుంకోజు బ్రహ్మచారి, మోత్కూరి లక్ష్మీకాంతం చారి తదితరులు పాల్గొన్నారు.

## ఇరిగేషన్ లస్కర్లు, హెల్పర్ల అడహక్ కమిటీ



**ముద్ర ప్రతినిధి, మెదక్:** ఇరిగేషన్ శాఖలో పనిచేస్తున్న లస్కర్లు, హెల్పర్ల సమస్యల పరిష్కారం కోసం అడహక్ కమిటీని ఏర్పాటు చేశారు.కన్వీనర్ గా మ్యాదరి మాణయ్య, కో–కన్వీనర్ గా చింతకాయల మల్లేశం,కమిటీ సభ్యులుగా ఎం.డి. అఫ్జాన్ ఖాన్, నీరుడి నర్సింలు,సదన శ్రీనివాస్, బట్టిగారి నర్సింలులను నియమించారు.తెలంగాణ క్లాస్ ఫోర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మెదక్ జిల్లా అధ్యక్షులు బి. ప్రసాద్, జిల్లా కార్యదర్శి ఎం.డి. రిజ్వాన్ అలీ మాట్లాడుతూ, ఇరిగేషన్ లస్కర్లు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తమ సంఘం తరఫున బలంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. లస్కర్లు, హెల్పర్లు ఐక్యంగా ఉంటేనే సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుంది అని సూచించారు.

## సస్పెన్షన్లు సమస్యకు పరిష్కారం కాదు

**ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకాన్ని కలిగించండి ఉపాధ్యాయ సంఘాలు**



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** ఎఫ్ఆర్ఎస్(ఫేషియల్ రికగ్నిజేషన్ సిస్టం) హాజరు ఆధారంగా ఇటీవల ఒకే పాఠశాలలో ఆరుగురు ఉపాధ్యాయులను ఇతర కారణాలతో మరొక ముగ్గురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం వలన ప్రజలందరికీ అందుబాటులో గల ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతుందని సస్పెండ్ చేసిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిద్దిపేట జిల్లాలో ఉన్న అన్ని ఉపాధ్యాయ సంఘాలు జిల్లా విద్యాధికారి సిహెచ్ రమేశ్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు తప్పు చేస్తే సరైన విచారణ చేసి చర్యలు చేపట్టాలని అన్నారు . సదరు ఉపాధ్యాయులకు ఎలాంటి సంజయ్ నోటీసు ఇవ్వకుండా ఏకపక్షంగా సస్పెండ్ చేయడం శోచనీయ మన్నారు. ఎఫ్ ఆర్ ఎస్ హాజరును మాత్రమే ప్రామాణికంగా తీసుకోవడం ద్వారా భౌతికంగా హాజరై వృత్తి నిబద్ధతతో పని స్తున్న కొంతమంది ఉపాధ్యాయులు అన్యాయంగా సస్పెండ్ అయ్యారని ఆరోపించారు. సాంకేతిక కారణాల వలన కొన్నిసార్లు ఎఫ్ ఆర్ ఎస్ నమోదు ఆలస్యమవుతుందని గుర్తు చేశారు. సిద్దిపేట జిల్లా పదవ తరగతి ఫలితాల్లో, క్రీడల్లో సైన్స్ ఎగ్జిబిట్ ప్రదర్శనలో రాష్ట్రస్థా యిలో మంచి గుర్తింపు పొందిన జిల్లాగా గత కొంతకాలంగా కొనసాగుతుంది. ఉపాధ్యాయుల పనితీరు ఆధారంగా గత జిల్లా విద్యాధికారి రాష్ట్ర ఉత్తమ జిల్లా విద్యాధికారిగా అవార్డు అందుకున్న విషయాన్ని గుర్తు చేశారు. సరిగా పనిచేయని ఉపాధ్యాయుల పై చర్యలు తీసుకోవాలన్నారు. ముందస్తు సంజాయి నోటీసు అందించి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు టిఎస్, టీఎస్ యుటిఎఫ్, ఎస్టియు టిఎస్, టీఆర్టిఎఫ్, తపస్, టిపిటిఎఫ్, డిటిఎఫ్, టీఎస్ హెచ్ఎంఎ, టిఎస్పిటిఏ, పిఆర్టియు తెలంగాణ, జిటిఏ,ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘాలు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘాలు,సిపిఎస్ సంఘం, పండిత పరిషత్ సంఘాలు , పిఎస్ హెచ్ఎంఎ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ వ్యతిరేకమైన రోస్టర్ విధానాన్ని రద్దు చేయాలి



**ముద్ర ప్రతినిధి, మెదక్:** ఉద్యోగ నియమకాలలో అమలు చేస్తున్న రాజ్యాంగ వ్యతిరేకమైన రోస్టర్ విధానాన్ని రద్దు చేయాలని మాలల కో–ఆర్డినేషన్ ఫోరం రాష్ట్ర నాయకులు తిరుపతి డిమాండ్ చేశారు. శనివారం మాలల కోఆర్డినేషన్ ఫోరం ఆధ్వర్యంలో మెదక్ టీఎన్జీవో భవన్లో మాలల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం జరిగింది. తిరుపతయ్య మాట్లాడుతూ రోస్టర్ విధానం వల్ల ఉద్యోగ నియమకాలలో మాలలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. రోస్టర్ విధానానికి వ్యతిరేకంగా గ్రామ గ్రామాన ఉద్యమాన్ని చేపట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకురాలు బండ శకుంతల మాట్లాడుతూ మాల జాతి మేల్కోవాల్సిన అవసరం వచ్చిందని చెప్పారు. మాలలందరూ ఐక్యంగా ఉద్యమించి రాజ్యాంగ హక్కులను అమలు చేసుకోవాలని పిలుపునిచ్చారు. మాలల జేఏసీ చైర్మన్ గా జల్ల సుధాకర్ ఎన్నికమాలల జాయింట్ యాక్షన్ కమిటీ మెదక్ జిల్లా చైర్మన్ గా జెల్ల సుధాకర్ ను ఎన్నుకున్నారు. కో చైర్మన్గా కల్లూరు సంజీవ్, కన్వీనర్ గా ఆకుల పెంటయ్య, వైస్ చైర్మన్ లు గా దుబాసి సంజీవ్, బొమ్మల మైసయ్య, తూప్రాన్ వెంకటేష్, మాసాయిపేట మల్లేశం లను ఎన్నుకున్నారు. ఆయా మండలాలకు ఇన్చార్జిలను నియమించారు. సెప్టెంబర్ 7న చలో కలెక్టరేట్ మాలల రోస్టర్ పాయింట్ ను సవరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 7న చలో కలెక్టరేట్ నిర్వహించాలని జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో శంకర్, రాధాకృష్ణ, శివ, యాదగిరి, ఆనందం, రాములు, రాజు, ఎల్లం, చంద్రం, ఆకుల యాదయ్య, రత్నం, మనోహర్, సురేష్ పాల్గొన్నారు.

## జీఆర్ఎంబీ సమావేశాన్ని బహిష్కరించాలి



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశం ఎజెండాలో ఏడు ప్రాజెక్టుల అనుమతుల రద్దు అంశాలను చేర్చడంపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని బీఆర్ఎస్ నాయకుడు పోచబోయిన శ్రీహరి యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. తెలంగాణకు చెందిన ప్రాజెక్టుల అనుమతుల రద్దు అంశాలను ఎజెండా నుంచి తొలగించిన తర్వాతే సమావేశానికి హాజరు కావాలని, లేదంటే జీఆర్ఎంబీ సమావేశాన్ని బహిష్కరించాలని కోరారు.తెలంగాణకు నీళ్లు, సాగునీరు, తాగునీటి విషయంలో ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని అన్నారు. ఎత్తిపోతల పథకాలే తెలంగాణకు జీవనాడి అని, రాష్ట్ర నీటి హక్కుల విషయంలో ఎలాంటి రాజీకి తావివ్వకూడదని పేర్కొన్నారు. కార్యక్రమంలో జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, కొండం రవీందర్‌రెడ్డి, మేడికాయల వెంకటేశం, కీసర పాపయ్య, రేగుల దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L. N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H. No. 7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg. No. TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555